



# నేటి ప్రభాత సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784.

ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 74 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజీలు : 8, వెల రూ. 4, /- బుధవారం - 04 - జూన్ - 2025




## బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

- ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నాం
- ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశాం

### దేశంలో 4 వేలు దాటిన యాక్టివ్ కేసులు..

## 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు

### ఏడాది జనవరి నుంచి దేశంలో 37 మరణాలు



కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి

మే 22 నాటికి దేశంలో 257 మంది యాక్టివ్ రోగులు

### భారత్‌తో వాణిజ్య ఒప్పందం

## ఎంతో దూరంలో లేదు: అమెరికా

త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు



ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం అంటున్న అమెరికా వాణిజ్య కార్యదర్శి

జులై 8 లోపు 26 శాతం సుంకం మినహాయింపు కోరుతున్న భారత్

## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా



- కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం
- మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చింది



## రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం

అమరావతి: గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో అనంతపురం నుంచి అమరావతి వరకు యాక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. దానికి కేంద్రం జాతీయ రహదారి సంఖ్యను కూడా కేటాయించింది. తర్వాత వైకాపా ప్రభుత్వం.. ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనపెట్టింది. దీంతో కేంద్రం ప్రత్యామ్నాయంగా అనంతపురం నుంచి గుంటూరు మిగతా.. 2లో

**ఎక్కడెక్కడ రెండు, నాలుగు వరుసలు**

| పరిధి | కి.మీ. | వరుసలు |
|---|---|---|
| అనంతపురం- బుగ్గ | 69 | 4 |
| బుగ్గ- గిద్దలూరు | 135 | 4 |
| గిద్దలూరు- వినుకొండ | 110 | 2 |
| వినుకొండ- గుంటూరు | 84.8 | 4 |

### ఈ నెల 5న కేబినెట్ సమావేశం..

## కీలక అంశాలపై చర్చ



హైదరాబాద్: రాష్ట్రంలో కొనసాగుతోన్న తెలంగాణ ప్రభుత్వం కీలక అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించేందుకు జూన్ 5న కేబినెట్ సమావేశం నిర్వహించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు వేదికకానుంది. ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికపై ఈ సమావేశంలో విశ్లేషణ జరగనుంది. పాత పింఛన్ విధానం, ప్రమోషన్లు, బదిలీలు, ఖాళీల భర్తీ తదితర అంశాలపై తీసుకునే నిర్ణయాల కోసం ఇది కీలకంగా మారింది. వివాదాస్పదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ), విజిలెన్స్ విభాగాలు సమర్పించిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. యువత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలు అంశంపై కూడ కేబినెట్ చర్చించనుంది. ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్లింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర పరిపాలనలో కీలక మలుపులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

# కెనడా జీ7 సదస్సుకు భారత్‌కు అందని ఆహ్వానం..

- ఆరేళ్లలో ఇదే మొదటిసారి!
- కెనడా జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా అందని ఆహ్వానం
- ఆరేళ్లలో తొలిసారి మోదీ గైర్హాజరయ్యే సూచనలు
- ఇది దౌత్యపరమైన భంగపాటంటూ కాంగ్రెస్ పార్టీ విమర్శ
- భారత్-కెనడా మధ్య ఉద్రిక్తతలే కారణమనే ఊహాగానాలు



ఢిల్లీ: కెనడా ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక జీ7 కూటమి శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈసారి దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది దౌత్యపరమైన వైఫల్యమని పేర్కొంది. ఆరేళ్ల కాలంలో ప్రధాని మోదీ జీ7 సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే తొలిసారి. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఇతర కీలక సవాళ్లపై సభ్య



దేశాల అధినేతలు చర్చించనున్నారు. అయితే, ఈ కీలక భేటీకి హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఆహ్వానం అందలేదు. ఒకవేళ చివరి నిమిషంలో ఆహ్వానం లభించినప్పటికీ, ప్రస్తుతం భారత్-కెనడా మధ్య నెలకొన్న మిగతా.. 2లో

### త్వరలో ఏపీ లాజిస్టిక్స్

# కార్పొరేషన్ ఏర్పాటు

- పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలి
- తొలిదశలో అమరావతి, కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి చేయాలి
- వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సీఎం సమీక్ష



అమరావతి: పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర సంపదగా తీర్చిదిద్దాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాదికి 4 పోర్టులు, 4 హార్బర్లు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో ఏపీ లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. తొలిదశలో అమరావతి, కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. పీపీపీ విధానంలో రద్దీ మేరకు రాష్ట్ర రహదారుల విస్తరణ చేపట్టనున్నట్టు వివరించారు. హైవేలతో అన్ని రాష్ట్ర రహదారులను అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. మచిలీపట్నం పోర్టు మొదటి దశ పనులు 43.25 శాతం పూర్తికాగా.. వచ్చే ఏడాది నవంబర్ నాటికి మొత్తం పనులు పూర్తికానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. రామాయపట్నం పోర్టు మొదటి దశ పనులు 63.89 శాతం, మూలపేట పోర్టు మొదటిదశ పనులు 46.59 శాతం, కాకినాడ గేట్‌వే పోర్టు పనులు 29.92 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మొదటి దశ నిర్మాణం పనులు 97.72 శాతం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 81.17 శాతం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 69.20 శాతం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మొదటి దశ పనులు 78.94 శాతం పూర్తయ్యాయని అధికారులకు సీఎంకు తెలిపారు.

## నడిరోడ్డుపై కొట్టే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు?

- చంద్రబాబుపై 24 కేసులున్నాయని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా?
- పోలీస్ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యం
- గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లంటూ పరువు తీస్తూ కథనాలు ఇచ్చాయి




తెనాలి: రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రం అదుపు తప్పిందని.. పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెనాలిలో పర్యటించిన ఆయన.. పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో చంద్రబాబు పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారు. మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. రెడ్‌బుక్‌తో వేధించి హింసిస్తున్నారు. పోలీస్ వ్యవస్థ వికృత రూపానికి తెనాలి ఘటనే సాక్ష్యం. తెనాలి పోలీసుల చేతిలో దళితులు, మైనారిటీల ముగ్గురు పిల్లలు దెబ్బలు తిన్నారు. రాకేష్ హైదరాబాద్‌లో జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆ యువకుడు తెనాలిలోనే ఉండడం లేదు. పాత కేసులో వాయిదా కోసం తెనాలికి వచ్చాడు. రాకేష్‌ను చూడడానికి అతని స్నేహితులు వచ్చారు. వాళ్లు కూడా మంగళగిరి నుంచి వచ్చారు. జాన్ విక్టర్ జూనియర్ అడ్వకేట్. బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కూడా ఉంది. ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న మిగతా.. 2లో



## అత్యంత పారదర్శకంగా 'భూభారతి'

- మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తాం
- కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నాం

ఖమ్మం: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మిగతా.. 2లో



### ఎంత నష్టం జరిగిందన్నది కాదు... ఎలాంటి ఫలితాలు సాధించామన్నదే ముఖ్యం

ఎదురుదెబ్బలతో సైనిక దళాలు ప్రభావితం కాబోవని సీడీఎస్ స్పష్టం

ఆపరేషన్ సిందూర్‌లో తొలినాళ్లలో కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు అంగీకారం

తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని, వ్యూహాలు మార్చుకోవడం అత్యవసరమని స్పష్టీకరణ

## 5న విచారణకు హాజరు కాలేను!

మరో గడువు ఇవ్వాలని కోరిన మాజీ సీఎం కేసీఆర్

5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావులు హాజరుకావాలి



### నేడు హైదరాబాద్‌కు ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల్లోని అవకతవకలపై విచారణ చేస్తున్న కమిషన్ ఎదుట ఈ నెల 5న హాజరు కాలేనంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కమిషన్‌కు విన్నవించారు. మరో తేదీన వస్తానని, గడువు ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌ను కోరారు. దీంతో కమిషన్ సానుకూలంగా స్పందించి... ఈ నెల 11న రావాలని సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మే 19న మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు ఈటల రాజేందర్(ఆర్థిక), తన్నీరు హరీశ్‌రావు(నీటిపారుదల)లకు నోటీసులు పంపింది. 5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావులు హాజరుకావాలని సూచించింది. ఈ క్రమంలో కమిషన్ ఎదుట హాజరై తమ మిగతా.. 2లో

## ఈనెల 6న జమ్మూకాశ్మీర్‌కు ప్రధాని మోదీ

### ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి జమ్మూ కాశ్మీర్‌కి

చీనాబ్ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించి, ఉగ్రవాదం అణచివేతకు సంబంధించిన కీలక ప్రకటనలు చేయనున్నారు



ఢిల్లీ: ఈనెల 6న ప్రధాని నరేంద్రమోదీ జమ్మూకాశ్మీర్‌లో పర్యటించనున్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జమ్మూ కాశ్మీర్ సందర్శించడం. ఈ పర్యటనలో మోదీ చీనాబ్ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించి, ఉగ్రవాదం అణచివేతకు సంబంధించిన కీలక ప్రకటనలు చేయనున్నారు. మిగతా.. 2లో




## రిజిస్ట్రేషన్ బిల్లు-2025 ముసాయిదా విడుదల

1908 రిజిస్ట్రేషన్ చట్టాన్ని భర్తీ చేయడానికి ఏర్పాటు

కొత్త బిల్లు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ వ్యవస్థకు మద్దతుగా నిలుస్తుంది

## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా

రష్యా-ఉక్రెయిన్ : ఒక వైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం చర్చలకు సన్నాహాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత 24గంటల్లో ఉక్రెయిన్‌పై తమ బలగాలు చేసిన దాడుల్లో 1,430 మందికి పైగా ఆ దేశ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేశామన్నారు. మరో వైపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చిందని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ ప్రకటించింది. యుద్ధంలో మొత్తం 9,90,800 మంది రష్యన్ సైనికులు మరణించారని..అందులో 1,100 మంది సైనికులు గత 24 గంటల్లో మరణించారని పేర్కొంది. తమ దాడుల్లో రష్యా 10,881 ట్యాంకులు, 22,671 సాయుధ పోరాట వాహనాలు, 50,607 ఇంధన ట్యాంకులు, 28,623 ఫిరంగి వ్యవస్థలు, 1,402 బహుళ ప్రయోగ రాకెట్ వ్యవస్థలు, 1,176 వైమానిక రక్షణ వ్యవస్థలు, 384 విమానాలు, 41 యుద్ధ విమానాలు, 336 హెలికాప్టర్లు, 38,748 డ్రోన్లు, 28 నౌకలు, ఒక జలాంతర్గామిని కోల్పోయిందని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య సోమవారం తుర్కియేలోని ఇస్తాంబుల్‌లోని సిరగాన్ ప్యాలెస్‌లో తుర్కియే విదేశాంగశాఖ మంత్రి హకన్ ఫిదాన్ అధ్యక్షతన సోమవారం రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. కాల్పుల విరమణ షరతులపై వారు చర్చించారు. అవి ఫలితమిచ్చినట్లు ఏ వర్గమూ ప్రకటించలేదు. ఈ చర్చలకు ముందు ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద దాడి చేయడం గమనార్హం. దీనికి ప్రతిగా మాస్కో సైతం ఉక్రెయిన్‌లో 1,000 కిలోమీటర్ల దూరం వెళ్లి.. 472 డ్రోన్‌లతో విరుచుకుపడింది.

## రిజిస్ట్రేషన్ బిల్లు-2025 ముసాయిదా విడుదల

ఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రాపర్టీ డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను ఆధునీకరించేందుకు ఉద్దేశించిన రిజిస్ట్రేషన్ బిల్లు-2025 ముసాయిదాను కేంద్రం ఆవిష్కరించింది. ఈ ప్రతిపాదిత చట్టం సమకాలీన డిమాండ్లకు సరిపోని నాటి 1908 రిజిస్ట్రేషన్ చట్టాన్ని భర్తీ చేయడానికి ఏర్పాటు చేశారు. కొత్త బిల్లు ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ వ్యవస్థకు మద్దతుగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. తద్వారా బ్యూరోక్రసీ, మధ్యవర్తుల అవసరం తగ్గనుంది. ప్రాపర్టీ డాక్యుమెంటేషన్‌పై ఆధారపడిన ఆర్థిక లావాదేవీలు, చట్టపరమైన నిర్ణయాలు, పరిపాలనా సేవలను క్రమబద్ధీకరించే విస్తృత ప్రయత్నంలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. భూ దందాల్లోనే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాల్లో కూడా ప్రాపర్టీ డాక్యుమెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నందున ఈ మార్పులు ప్రాధాన్యత చోటుచేసుకుంటున్నాయి. 1908 రిజిస్ట్రేషన్ చట్టం ఆన్‌లైన్ డాక్యుమెంట్ నిర్వహణ, డిజిటల్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వంటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపొందించబడలేదు. ఈ వెసులుబాట్లు టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో అత్యవసరంగా మారాయి. ప్రాపర్టీ డాక్యుమెంట్లు ఇప్పుడు కేవలం భూ దందాలకు మాత్రమే కాకుండా వివిధ ఆర్థిక, చట్టపరమైన కార్యకలాపాలకు కీలకంగా మారుతున్నాయి. అనేక రాష్ట్రాలు ఇప్పటికే ఆన్‌లైన్ అప్‌లోడ్‌లు, ఆధార్ ఆధారిత ధ్రువీకరణను అమలు చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా దేశం అంతటా స్థిరమైన, విశ్వసనీయమైన వ్యవస్థను స్థాపించడానికి కొత్త చట్టం అవసరమని భావిస్తున్నారు. ఈ ఏకరూపత పౌరులందరికీ సమర్థవంతమైన, సురక్షితమైన ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలకు అవకాశం కల్పిస్తుందని భావిస్తున్నారు.

ప్రతిపాదిత అంశాలు..

గృహ కొనుగోలుదారులకు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత అందుబాటులోకి తీసుకురావడం, సమర్థవంతంగా నిర్వహించడం కొత్త బిల్లులోని ప్రధానాంశాల్లో ఒకటి. ప్రతిపాదిత విధానంలో పౌరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పదేపదే వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆస్తి పత్రాలను డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పేపర్ వర్క్ తగ్గుతుందని, ప్రక్రియలను వేగవంతం చేస్తుందని, మధ్యవర్తులపై ఆధారపడటాన్ని పరిమితం చేస్తుందని భావిస్తున్నారు. ఆస్తుల లావాదేవీలకు డిజిటల్ రికార్డులను తప్పనిసరి చేయడం ద్వారా చట్టపరమైన రక్షణ పెరుగుతుంది. ఈ చర్యతో అమ్మకం ఒప్పందాలు, తనఖా పత్రాలు, సేల్ సర్టిఫికేట్లు వంటి కీలక డాక్యుమెంట్ల చట్టబద్ధత మెరుగుపడుతుందని భావిస్తున్నారు. డిజిటల్-ఫస్ట్ విధానాన్ని అవలంబించడం ద్వారా, ఆస్తి లావాదేవీలను మరింత పారదర్శకంగా, సురక్షితంగా చేయడమే ఈ బిల్లు లక్ష్యం.

### దేశంలో 4 వేలు దాటిన యాక్టివ్ కేసులు..

## 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు

ఢిల్లీ: మంగళవారం (జూన్ 3, 2025) విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారతదేశంలో యాక్టివ్ కొవిడ్-19 కేసులు 4,000 మార్కును దాటాయి, కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి. మంగళవారం (జూన్ 3, 2025) విడుదల చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారతదేశంలో యాక్టివ్ కొవిడ్-19 కేసులు 4,000 మార్కును దాటాయి, కేరళ అత్యంత ప్రభావితమైన రాష్ట్రంగా కాగా, తరువాత మహారాష్ట్ర, గుజరాత్,ఢిల్లీలో ఉన్నాయి. దేశంలో 4,026 యాక్టివ్ కేసులు ఉన్నాయి మరియు గత 24 గంటల్లో ఐదు కొత్త మరణాలు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో 37 మరణాలు సంభవించాయి. మే 22 నాటికి దేశంలో 257 మంది యాక్టివ్ రోగులు ఉన్నారు. మే 31 నాటికి ఈ సంఖ్య 3,395కి, ఆ తర్వాత 4,026 కేసులకు పెరిగింది. ప్రస్తుతం కేరళలో 1,416 యాక్టివ్ కేసులు ఉన్నాయి, దేశంలో అత్యధికంగా మహారాష్ట్ర 494, గుజరాత్ 397, ఢిల్లీలో 393 కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో ఐదు మరణాలు - కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కటి, మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించాయని డేటా తెలిపింది. దేశంలో కొవిడ్-19 పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇన్ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందని, చాలా మంది రోగులు ఇంటి సంరక్షణలో ఉన్నారని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రభుత్వ ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రస్తుత కేసుల పెరుగుదలకు దారితీసిన వైవిధ్యాలు తీవ్రమైనవి కావని, అవి ఓమిక్రాన్ యొక్క ఉప వైవిధ్యాలు మాత్రమేనని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహ్ల్ సోమవారం పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండాలి కానీ ఆందోళన చెందడానికి ఎటువంటి కారణం లేదు" అని డాక్టర్ బెహ్ల్ అన్నారు.

### భారత్‌తో వాణిజ్య ఒప్పందం

## ఎంతో దూరంలో లేదు: అమెరికా

భారత్-అమెరికా : భారతదేశం-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుంకాల ప్రతిష్టంభన నేపథ్యంలో చర్చలు ఊపందుకున్నాయని, రెండు దేశాలకూ ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రయోజనాలపై ఏకాభిప్రాయం కుదిరిందని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో వార్షిక సదస్సులో పాల్గొన్న లుట్నిక్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సమీప భవిష్యత్తులోనే కుదురుతుందని మీరు ఆశించవచ్చు" అని అన్నారు. ట్రంప్ ప్రభుత్వం వాణిజ్య ఒప్పందాలను వేగవంతం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వాణిజ్య లోటుకు కారణమవుతున్నాయన్న ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, చైనా మినహా ఇతర దేశాలపై ఈ సుంకాలను జులై 8 వరకు 90 రోజుల పాటు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తమ వస్తువులపై అమెరికా విధించిన 26 శాతం అదనపు సుంకం నుంచి భారత్ పూర్తి మినహాయింపు కోరుతోంది. ఈ నేపథ్యంలో జులై 8 లోపు మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయని వార్తలు వస్తున్న తరుణంలో లుట్నిక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత్, అమెరికా పరస్పరం ఒకరి వ్యాపారాలకు మరొకరు ప్రాధాన్యంతో కూడిన మార్కెట్ ప్రవేశం కల్పించాలని కోరుకుంటున్నాయని, ఇరు దేశాల బృందాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. కాగా, ప్రతిపాదిత మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌లో పర్యటిస్తోంది. గత నెలలో, భారత ప్రధాన సంప్రదింపుల అధికారి, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో నాలుగు రోజుల పర్యటన ముగించారు. వాణిజ్య చర్చలకు మరింత ఊతమిచ్చేందుకు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కూడా ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు.

### ఎంత నష్టం జరిగిందన్నది కాదు...

### ఎలాంటి ఫలితాలు సాధించామన్నదే ముఖ్యం

## త్రివిధ దళాధిపతి అనిల్ చౌహాన్

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు అంగీకరించిన కొద్ది రోజులకే, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నికార్సయిన సైనిక దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని ఆయన స్పష్టం చేశారు. యుద్ధంలో నష్టాల కంటే ఫలితాలే ముఖ్యమని నొక్కిచెప్పారు. సావిత్రిబాయి ఫులే పుణే విశ్వవిద్యాలయంలో 'భవిష్యత్ యుద్ధాలు - యుద్ధరీతులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇస్తూ జనరల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "వృత్తిపరమైన దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావని నేను భావిస్తున్నాను. యుద్ధంలో ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ, మనోధైర్యం ఉన్నతంగా ఉండటం చాలా ముఖ్యం. పరిస్థితులకు తగ్గట్టుగా మారగలగడం అనేది వృత్తిపరమైన సైనిక శక్తికి ముఖ్యమైన లక్షణం. ఏం తప్పు జరిగిందో అర్థం చేసుకోగలగాలి, తప్పును సరిదిద్దుకుని మళ్ళీ ప్రయత్నించాలి. భయంతో కూర్చోకూడదు" అని అన్నారు. పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసే క్రమంలో, మే 7న జరిగిన ప్రతిఘటనలో భారత్ కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని జనరల్ చౌహాన్ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. ఆ నష్టం తర్వాత భారత దళాలు తమ వ్యూహాలను మార్చుకుని, సరిహద్దుకు ఆవల ఉన్న పాక్ వైమానిక స్థావరాలకు భారీ నష్టాన్ని కలిగించాయని ఆయన వివరించారు. "మే 7న, ఆరంభ దశలో నష్టాలు జరిగాయని నేను చెప్పగలను" అని జనరల్ చౌహాన్ గతంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఘటన ఆధునిక ప్రపంచానికి ఆమోదయోగ్యం కాదని ఆయన తీవ్రంగా ఖండించారు. "పహల్గామ్‌లో జరిగింది బాధితుల పట్ల తీవ్రమైన క్రూరత్వం. ఎందుకంటే వారందరినీ వారి కుటుంబ సభ్యులు, పిల్లల ముందే తలపై కాల్చి చంపారు. మతం పేరుతో వారిని కాల్చిచంపడం ఈ ఆధునిక ప్రపంచానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. పాశ్చాత్య దేశాలు ఒకటి లేదా రెండు ఉగ్రవాద చర్యలను ఎదుర్కొని ఉండవచ్చు. కానీ భారత్ అత్యధిక ఉగ్రవాద దాడులకు గురైంది, దాదాపు 20,000 మంది ప్రాణాలు కోల్పోయారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, అది కొనసాగుతోందని సీడీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. "ఇది శత్రుత్వాల తాత్కాలిక విరమణ మాత్రమే. మనం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది," అని ఆయన అన్నారు. పాకిస్థాన్ విషయానికొస్తే, నేను రెండు అంచనాలు వేయగలను. ఒకటి, వారు చాలా దూరం నుంచి వేగంగా ఆయుధాలను కోల్పోతున్నారు, ఇది మరికొంత కాలం కొనసాగితే, వారు మరింత నష్టపోయే అవకాశం ఉందని వారు భావించి ఉండవచ్చు, అందుకే వారు కాల్పుల విరమణకు ప్రతిపాదించి ఉంటారు" అని జనరల్ అనిల్ చౌహాన్ విశ్లేషించారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

హైదరాబాద్: గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులోభాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకు వెళ్లి.. మాట్లాడామన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### ఈనెల 6న జమ్మూకాశ్మీర్‌కు ప్రధాని మోదీ

### ఆపరేషన్ సిందూర్ అనంతరం

## తొలిసారి జమ్మూ కాశ్మీర్‌కి

మొదటి పేజి తరువాయి



కాగా, ఇప్పటికే కేంద్ర మంత్రులు అమిత్ షా, రామ్మోహన నాయుడు, అలాగే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జమ్మూకాశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలలో పర్యటించిన విషయం తెలిసిందే. ఇక ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. పాకిస్థాన్ మద్దతుతో జరిగిన దాడుల్లో దెబ్బతిన్న నివాసాలను పరిశీలించారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై పలు కఠిన చర్యలు తీసుకుంది. వాటిలో ముఖ్యంగా సింధు నదీ జలాల ప్రవాహాన్ని నిలిపివేయడం, పాకిస్థాన్‌కు ఇచ్చిన వీసాలను రద్దు చేయడం, అటారీ సరిహద్దును మూసివేయడం ఉన్నాయి.

## అత్యంత పారదర్శకంగా 'భూభారతి'

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## 5న విచారణకు హాజరు కాలేను!

మొదటి పేజి తరువాయి



ఈ క్రమంలో కమిషన్ ఎదుట హాజరై తమ బాణీ వినిపించేందుకు కేసీఆర్, హరీశ్‌రావులు సన్నద్ధమయ్యారు. ఒకటికి రెండుసార్లు వారిద్దరూ సమావేశమై విచారణలో వివరించాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇంతలో కేసీఆర్ విచారణకు మరో తేదీని కోరారు. మరోవైపు కాళేశ్వరం విశిష్టతను పార్టీ శ్రేణులకు, ప్రజలకు తెలియజేయాలని భారాస నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మీడియాకు తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు నిర్ణయించగా చివరి సమయంలో వాయిదా వేశారు. నేడు హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్: కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం సాయంత్రం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఐదు నుంచి మలిదశ విచారణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

### నడిరోడ్డుపై కొట్టే అధికారం

## పోలీసులకు ఎవరిచ్చారు?

మొదటి పేజి తరువాయి

ఐతా నగర్‌లో సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్ ఎవరితో గొడవ పడుతుంటే ఈ యువకులు అడ్డుకున్నారు. గొడవపడుతున్న కానిస్టేబుల్‌ను వీళ్లు ప్రశ్నించారు. కేవలం కానిస్టేబుల్‌ను ప్రశ్నించడం వీళు చేసిన తప్పా?. ఏప్రిల్ 24న కానిస్టేబుల్‌ను యువకులు ప్రశ్నించారు. 25న పోలీసులు మంగళగిరి వెళ్లి జాన్ విక్టర్, కరీముల్లాను కొట్టుకుంటూ తీసుకొచ్చారు. తెనాలి పీఎస్‌లో కూడా పడేసి కొట్టారు. ఏప్రిల్ 26న ఐతానగర్‌లో నడిరోడ్డు మీద పడేసి ముగ్గురిని చితకబాదారు. కొట్టొద్దని వేడుకున్నా పోలీసులు వదల్లేదు. యువకుల పరువు ప్రతిష్టలతో ఆడుకుంటూ పడేసికొట్టారు. విక్టర్ జేబులో కత్తి పోలీసులే పెట్టారు. ఈ వ్యవహారంలో తెనాలి టూటౌన్ సీఐ, మరో పీఎస్ సీఐ కూడా ఉన్నారు. ఇద్దరూ వీఆర్వో సమక్షంలో పంచనామా రాసుకున్నారు. అరెస్ట్ చేసిన వాళ్లను సకాలంలో కోర్టు ముందు ప్రవేశపెట్టలేదు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన తర్వాతే ముగ్గురి మీద రౌడీషీట్ తెరిచారు. పోలీసులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారనేది అర్థమవుతోంది. పోలీసులే తీర్పులు ఇస్తున్నారు. జరుగుతున్నది అన్యాయం అని తెలిసి కూడా.. ఎల్లో మీడియా బ్యాచ్ దారుణంగా కథనాలు ఇచ్చింది. గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లంటూ పరువు తీస్తూ కథనాలు ఇచ్చాయి. కేసులు ఎవరి మీదా అయినా ఉండొచ్చు. ఆ వ్యహారాన్ని కోర్టులు చూసుకుంటాయి. చంద్రబాబుపై 24 కేసులున్నాయని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా?. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తారా?. ఇలా చేసే నైతికత పోలీసులకు ఉందా? ఇది ధర్మమేనా?. పరువు, ప్రతిష్టలు తీసే హక్కు పోసులకు ఉందా?. నడిరోడ్డుపై కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారు? పోయిన ఆ కుటుంబాల పరువును ఎవరు తీసుకొస్తారు? అని జగన్ ప్రశ్నించారు.

### భారత విమానయాన రంగంలో

## పెట్టుబడులకు అద్భుత అవకాశాలు: ప్రధాని మోదీ

ఢిల్లీ: వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన రంగంలో ప్రముఖ గ్లోబల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 42 ఏళ్ల తర్వాత దేశంలో జరుగుతున్న గ్లోబల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2030 నాటికి నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) సెగ్మెంట్ పరిమాణాన్ని 4 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రపంచ వాయు రవాణా పరిశ్రమలో భారత విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ రంగంలో భారీ పెట్టుబడులకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. "ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ పౌర విమానయాన మార్కెట్ భారత్‌దే. భారత్‌ను ప్రపంచం కేవలం విమానయాన మార్కెట్‌గా మాత్రమే కాకుండా వాల్యూ చైన్ లీడర్‌గా చూడాలని కోరుకుంటున్నాం. మా దిశ సరైంది. మా వేగం సరైంది.. అందువల్ల మేం శరవేగంగా ముందుకు దూసుకెళ్లడాన్ని కొనసాగిస్తాం" అన్నారు. ప్రపంచ స్థాయి విమానాశ్రయాల్లో భారత్ పెట్టుబడులు పెడుతోందన్న ప్రధాని.. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 162కి పెరిగిందన్నారు. ఉడాన్ పథకం విజయవంతం కావడం భారత పౌర విమానయాన రంగంలో ఒక సువర్ణాధ్యాయమని చెప్పారు.

### ఆల్ టైమ్ రికార్డ్... హైదరాబాద్‌లో

## రూ.1 లక్ష దాటిన బంగారం ధర

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,00,110 కి చేరింది. ఇది బంగారం ధరల చరిత్రలోనే అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,015 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు ఆ రికార్డును కూడా అధిగమించి పసిడి ధర కొత్త శిఖరాలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సరఫరా-డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటి అంశాలు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాకుండా, చాలామంది బంగారాన్ని దీర్ఘకాలిక సురక్షితమైన పెట్టుబడిగా భావించడం కూడా అధిక కొనుగోళ్లకు కారణమైంది.

## కేనడా జీ7 సదస్సుకు భారత్‌కు అందని ఆహ్వానం..

భారత్-కెనడా మధ్య నెలకొన్న ఉద్రిక్త సంబంధాల నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ పర్యటనకు సుముఖత చూపకపోవచ్చనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే, గత ఆరేళ్లలో ప్రధాని మోదీ జీ7 సదస్సుకు హాజరుకాని తొలి సందర్భం ఇదే అవుతుంది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో స్పందించింది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ మాట్లాడుతూ, జీ7 కూటమి సభ్య దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా దేశాధినేతలతో పాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు కూడా ఆహ్వానాలు అందాయని తెలిపారు. 2014కు ముందు జీ8గా ఉన్న సమయంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు క్రమం తప్పకుండా ఆహ్వానాలు అందేవని, 2014 తర్వాత కూడా ఈ సంప్రదాయం కొనసాగిందని గుర్తుచేశారు. అయితే, ఆరేళ్లలో తొలిసారి భారత ప్రధానికి ఆహ్వానం అందకపోవడం దౌత్యపరంగా ఎదురైన భంగపాటేనని ఆయన విమర్శించారు. భారత్-పాకిస్థాన్ మధ్యవర్తిత్వానికి అమెరికాను అనుమతించడం వంటి పరిణామాల తర్వాత ఇది మరో దౌత్యపరమైన వైఫల్యంగా ఆయన అభివర్ణించారు. జీ7 కూటమిలో భారత్ సభ్యదేశం కానప్పటికీ, ఆతిథ్య దేశాల ప్రత్యేక ఆహ్వానం మేరకు భారత ప్రధానులు గతంలో పలుమార్లు ఈ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొన్నారు. గత ఏడాది ఇటలీలో జరిగిన జీ7 సదస్సుకు భారత్‌తో పాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికాకు చెందిన పలు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ఆ సమావేశంలో పాల్గొని తన వాణిని వినిపించారు.

## రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం

మూడవ పేజి తరువాయి



దీంతో కేంద్రం ప్రత్యామ్నాయంగా అనంతపురం నుంచి గుంటూరు వరకు 398.8 కి.మీ. పొడవున ఉన్న జాతీయ రహదారి-544డిని విస్తరించేందుకు ముందుకొచ్చింది. ఇందులో 288.8 కి.మీ.లను నాలుగు వరుసలుగా విస్తరిస్తుండగా.. మధ్యలో 110 కి.మీ.లను మాత్రం రెండు వరుసలుగానే వదిలేశారు. ఇందుకు కొన్ని సాంకేతిక కారణాలను సాకుగా చూపిస్తున్నారు. దాన్ని కూడా నాలుగు వరుసలుగా విస్తరిస్తే రాజధాని నుంచి రాయలసీమకు రాచమార్గం పడినట్లే..

ఆ భాగం మినహా..

అనంతపురం నుంచి ముచ్చుకోట మీదుగా బుగ్గ వరకు 69 కి.మీ. నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. రెండు ప్యాకేజీలుగా రూ.1,600 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. బుగ్గ నుంచి కైప మీదుగా గిద్దలూరు వరకు 135 కి.మీ. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉండగా, దీన్ని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇందులో 15 కి.మీ. రక్షిత అటవీ ప్రాంతం మీదుగా వెళ్తుండగా, దానిని సైతం నాలుగు వరుసలుగా విస్తరించేందుకు క్లియరెన్స్ ఇచ్చింది. దీనికి డీపీఆర్ తయారీతోపాటు, మరోవైపు భూసేకరణ ఆరంభించారు. గిద్దలూరు నుంచి వినుకొండ వరకు 110 కి.మీ.లను పది మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా విస్తరించే పనులు 2020లో పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఎన్‌హెచ్ఏఐ టోల్ వసూలు చేస్తోంది. నాలుగు వరుసలుగా విస్తరించే ప్రతిపాదనపై మాత్రం దృష్టిపెట్టడం లేదు. వినుకొండ నుంచి గుంటూరు వరకు ఉన్న 84.8 కి.మీ.లను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు మోర్త్ ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ ఆమోదం తెలిపింది. దీనికి రూ.2,605 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు. మూడు జిల్లాల్లో భూసేకరణకు సంబంధించి ల్యాండ్ ప్లాన్ సర్వే కూడా చేపట్టారు. డీపీఆర్ సిద్ధమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడితే సాకారం

అనంతపురం - గుంటూరు హైవే నాలుగు వరుసలుగా విస్తరిస్తూ, మధ్యలో 110 కి.మీ. రెండు వరుసలుగా వదిలేయడం సరికాదని, దీనిని కూడా నాలుగు వరుసలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. అనంతపురం-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే కల సాకారం కాలేదు. ప్రత్యామ్నాయ రహదారిగా భావిస్తున్న అనంతపురం- గుంటూరు హైవే మొత్తం నాలుగు వరుసలతో ఉండాలని కేంద్రానికి తెలియజేయాలి. బుగ్గ-గిద్దలూరు మధ్య అటవీ ప్రాంతంలో సైతం నాలుగు వరుసల హైవేగా విస్తరణకు సమ్మతించిన కేంద్రం.. గట్టిగా పట్టుబడితే గిద్దలూరు-వినుకొండ మధ్య 110 కి.మీ.లను విస్తరించేందుకూ అంగీకరించొచ్చు. ఒకవేళ గిద్దలూరు- వినుకొండ మధ్య తగినంత వాహన రద్దీ లేదని చెబితే.. ఈ ప్యాకేజీకి అటూ, ఇటూ నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నందున ఇందులో కూడా ట్రాఫిక్ పెరుగుతుందనే వాదన బలంగా వినిపించొచ్చు.

శ్రీశైలానికి కీలక రహదారి

శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఉన్న ఏడు ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం వెళ్లేందుకు గుంటూరు-అనంతపురం హైవే కీలకం. వీరంతా ఈ హైవేలో గుంటూరు, వినుకొండ, త్రిపురాంతకం మీదుగా కుంట వరకు ప్రయాణించి, అక్కడి నుంచి శ్రీశైలానికి వెళ్తారు. 544డిని పూర్తిస్థాయిలో నాలుగు వరుసలుగా విస్తరిస్తే ఈ హైవే మీదుగా వాహనాల్లో శ్రీశైలం వెళ్లే భక్తుల సంఖ్య కూడా మరింత పెరుగుతుంది.



## డాలస్‌లో మహాత్ముడికి నివాళులర్పించిన కేటీఆర్

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్ (ఇర్వింగ్)లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేశ్ ప్రేమ్ కుమార్, ఎన్‌ఆర్ఐ భారాస అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేశ్, ఎన్‌ఆర్ఐ భారాస గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్, నేతలు ఎల్.రమణ, తాతా మధు, గ్యాదరి బాలమల్లు, నవీన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నోముల భగత్, బానోతు చంద్రావతి, గండ్ర జ్యోతి, దామోదర్, జాన్సన్ నాయక్, అమరేందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, యుగంధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అభిలాష్ రంగినేని, సోమ ఉపేందర్‌రెడ్డి, వంశీరెడ్డి, అరవింద్‌రావు తక్కెళ్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులకు భలే స్పందన



చింతపల్లి, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 3: చింతపల్లి మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు మొదటిరోజు వర్కాల, నెల్వలపల్లి గ్రామాలలో తహసిల్దార్ రమాకాంత్ శర్మ, రెవెన్యూ సిబ్బంది మంగళవారం ప్రారంభించారు. ఈ రెవెన్యూ సదస్సులు ఈనెల 3వ తేదీ నుండి మొదలుకొని 18వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్లో నమోదు చేస్తున్నామని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి సమస్యల పరిష్కారానికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. నెల్వలపల్లి గ్రామంలో రైతుల ద్వారా స్వీకరించి దరఖాస్తులు మొత్తం 23 మిస్సింగ్ - సర్వే నం. 14, ఎక్స్‌టెంట్ కరెక్షన్- 03, డిఎస్ పెండింగ్-01, సాదాబైనామా-02, సర్వే నెంబేర్ మార్పు - 01, ఆధార్ మార్పు-1, ప్రభుత్వం మరియు (పిఓటి) - 01 మొత్తం 23 దరఖాస్తులు వచ్చాయన్నారు. అదేవిధంగా వర్కాల గ్రామంలోమొత్తం దరఖాస్తులు-24 ఎక్స్ టెంట్ సవరణ-2 తప్పిపోయిన సర్వే - 16 సర్వే నంబర్ కరెక్షన్-2క్లాసిఫికేషన్-1డిఎస్ పెండింగ్ -1సస్పెషన్ - 1పెండింగ్ మ్యుటేషన్-1 దరఖాస్తులు వచ్చాయి.సదస్సుకు వచ్చిన ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను తహసీల్దార్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదాబైనామా, పీ.ఓ.టీలను క్రమబద్ధీకరించడం భూములకు సంబంధించిన ఏ సమస్య అయినా దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేశారు. ఒకే దరఖాస్తులో ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే, ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరూపుతామని అన్నారు.ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను పరిరక్షిస్తూ రెవెన్యూ సదస్సులు రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహిస్తున్నారు.

## నాపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారం

### నేను దళిత వ్యతిరేకిని కాదు.

### బీజేపీ సీనియర్ నాయకులు కందాల బలదేవరెడ్డి.



తుర్కయంజాల్, ప్రభాత సూర్య జూన్3 : కోహెడ దళిత రైతులు తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని బీజేపీ సీనియర్ నాయకులు కందాల బలదేవరెడ్డి అన్నారు. కోహెడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బలదేవరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కోహెడ గ్రామంలో జరుగుతున్న కొన్ని వ్యవహారాలు తనను ఇబ్బందికి గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 956లో దళితుల భూమి విషయంలో బద్నాం చేయడం తగదన్నారు. 956 లే అవుట్ వెంచర్ లో ప్లాట్ నెంబర్ 183లో 120 గజాల స్థలం 2016 కొన్నట్లు తెలిపారు. తానుకూడా ఆ వెంచర్ ప్లాట్ ఓనర్లలో సభ్యుడిగా ఉన్నందుకు ఓపెన్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ స్థలం తమది అంటూ కోహెడకు చెందిన కొందరు వ్యక్తులు ప్లాట్లను చెడగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఈ క్రమంలో కోహెడ దళిత రైతులకు, ప్లాట్ల ఓనర్లకు మధ్య జరిగిన వివాదానికి తనకు సంబంధం లేదని తెలిపారు. తాను ఎవరి హక్కులకు భంగం కలిగించబోనని అన్నారు. గత 30 ఏళ్లుగా ఊరి బాగు కోసం, దళితుల అభ్యున్నతి కోసం ఎన్నో కార్యక్రమాలు చేశానని, ఆ విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎవరినీ కులం పేరుతో దూషించలేదని తెలిపారు. తనపై అకారణంగా పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని బలదేవరెడ్డి కోరారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులతో సమస్యలకు పరిష్కారం



ఇబ్రహీంపట్నం, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 3 ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని అబ్దుల్లాపూర్ మెట్టు మండలం అబ్దుల్లాపూర్ మెట్ గ్రామం లో రెవిన్యూ సదస్సును ప్రారంభించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి. అనంతరం అబ్దుల్లాపూర్ మెట్ మండలం, తుర్క యాంజాల్ మున్సిపాలిటీ, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ లకు సంబందించిన 236 మంది లబ్దిదారులకు 2కోట్ల 36లక్షల 27వేల 376రూపాయల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి నుండి మొదలైన రెవెన్యూ సదస్సులు ఈనెల 25 వరకు కొనసాగుతాయని తమ తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి సమస్యల పరిష్కారానికి నోటీసులు జారీ చేసి అధికారులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు.




### వాస్తవాలు ప్రశ్నిస్తే.. విమర్శల వేడి ఎందుకు..?

## కేంద్రంపై జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి బీజేపీ నేతలపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రాహుల్ గాంధీపై లేనిపోని విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మీడియాతో మాట్లాడిన ఆయన, దేశ భద్రతపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిష్క్రియతను పరోక్షంగా ఎండగట్టారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పాకిస్తాన్ మిలిటెంట్లు దేశంలోకి చొరబడి 26 మందిని కాల్చి చంపారని, కాశ్మీర్‌లోని పార్క్‌లో ఉగ్రవాదులు హింస సృష్టించేసరికి కేంద్ర ఇంటలిజెన్స్ ఏం చేస్తోంది? అని ప్రశ్నించారు. దేశంలో ఇటువంటి ఘటనలు జరుగుతుంటే ప్రధాని మోదీ రాహుల్ గాంధీ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోగా, బీజేపీ నేతలు విమర్శలకు పాల్పడటం దుర్మార్గమని చెప్పారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి నేతలు రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "మీరు నిద్రలో ఉండి విమర్శలు చేస్తే మేము చూస్తూ ఊరుకోం," అంటూ హెచ్చరించారు. "తప్పులు మీరు చేస్తే, ప్రతిపక్ష నాయకుడిపై నింద వేయడం సరికాదు," అని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల సమయంలో దేశ ప్రజలు ప్రధానమంత్రి మోడీ యుద్ధం చేస్తారని భావించారని జగ్గారెడ్డి అన్నారు. కానీ అకస్మాత్తుగా యుద్ధం ఆగిపోయిందని, ఈ ప్రకటనను మోదీ కాకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేయడం విచారకరమని మండిపడ్డారు. "దేశప్రజలకి యుద్ధం ఆగిందని మోదీ చెప్పాల్సినప్పుడు ట్రంప్ చెప్పడమేంటో?" అంటూ ప్రశ్నించారు. ఇదే సందర్భంలో ఇందిరాగాంధీ అధికారంలో ఉన్న సమయంలో అమెరికా జోక్యాన్ని ఎలా తిరస్కరించిందో గుర్తు చేశారు. వాజ్‌పాయి జన్మదినం రోజున ప్రధాని మోదీ పాకిస్తాన్ వెళ్లడం, అక్కడ నవాజ్ షరీఫ్ తల్లి కాళ్లను మొక్కడం వంటి సంఘటనలను జగ్గారెడ్డి గుర్తుచేశారు. "ఇలాంటి సమయంలో మేమేంటన్నట్లు రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం సరైంది కాదు," అని బీజేపీ నేతలను ఉద్దేశించి అన్నారు. బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై రాహుల్ గాంధీ వేసే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని, లేకపోతే విమర్శలు చేయడం మానుకోవాలి. వాస్తవాలు వెలికి తీయడమే కాంగ్రెస్ బాధ్యత. దాన్ని తప్పుగా చిత్రీకరించబోద్దని ఆయన వ్యాఖ్యానించారు.

## మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్ పైనే మా దృష్టి




**హైదరాబాద్, :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జపాన్ కిటాక్యూషు నగర ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర భవిష్యత్తు కోసం కొత్త అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఎలా నిర్మించబడుతున్నాయో వివరించారు. "తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు, రాష్ట్ర పురోగతిని వేగవంతం చేయడం కోసం, కొత్త ప్రపంచ భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడమే మా లక్ష్యం," అని సీఎం పేర్కొన్నారు. అప్రిల్‌లో జపాన్‌ను సందర్శించిన సమయంలో, కిటాక్యూషు నగర అభివృద్ధిని దగ్గర నుంచి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. "ఎకో-టౌన్ మోడల్ నాకు గట్టిగా ప్రేరణనిచ్చింది. ఆ ప్రేరణతో హైదరాబాద్‌లో కూడా అలాంటి మోడల్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం," అన్నారు. ఈ దిశగా ఇప్పటికే అనేక జపనీస్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలపై తెలంగాణ ప్రభుత్వం సంతకాలు చేసింది. ఈ ఒప్పందాలు సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాల లక్ష్యం, పట్టణ ఆవిష్కరణలలో భాగస్వామ్యానికి పునాది కానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కిటాక్యూషు-తెలంగాణ సహకార ఒప్పందంపై ఈ రోజు సంతకం చేయడం ఎంతో ఆనందంగా ఉంది," అని తెలిపారు. రాష్ట్రం ప్రస్తుతం మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై కేంద్రీకృత దృష్టితో పనిచేస్తోందని చెప్పారు. అలాగే, తెలంగాణ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. "మా విద్యార్థులు జపనీస్ భాష నేర్చుకోవాలనే ఆసక్తి చూపుతున్నారు. జపాన్‌లో అవకాశాలను అన్వేషించాలనుకుంటున్నారు. మీ సహకారంతో వారికి జపనీస్ నేర్పించే అవకాశాలపై పని చేస్తాం," అన్నారు. ఇక హైదరాబాద్, కిటాక్యూషు మధ్య ప్రత్యక్ష విమాన కనెక్టివిటీ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం వెల్లడించారు. "మీ నగరం చూపిన నాయకత్వం అభినందనీయం. కిటాక్యూషు అభివృద్ధి నమూనా, తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉంది. మన స్నేహం సుదీర్ఘంగా, అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నా," అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.ు

## ఆధార్ కేంద్రం లేక అవస్థ ఏ పథకం అమలుకైనా ఆధారే అవసరం

### చింతపల్లిలో ఏడాదికితమే మూతపడ్డ ఆధార్ కేంద్రాలు

### ప్రస్తుతం దేవరకొండ ఆధార్ కేంద్రమే దిక్కు.








చింతపల్లి, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 3: చింతపల్లి మండలంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కార్డు లేకుండా ఏ పని చేయలేం. కొత్త ఆధార్ కార్డులు చేయించాలన్నా, ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేయాలన్నా ఆధార్ సెంటర్ల ద్వారానే చేయాలి. చింతపల్లి మండలంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు చాలా దూర ప్రాంతమైన దేవరకొండకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ పథకాలలో ఆధార్ తప్పనిసరి, చాలా ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు లేకపోతే ఆ పథకాలకు అర్హత ఉండదు. ఆధార్ సెంటర్లు లేకపోవటం వల్ల ప్రజలకు చాలా సమయం వృధా అవుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయించుకోవడానికి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు కూడా కలుగుతున్నాయి. ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకొని మండలంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ బియ్యం తీసుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఆధార్ కలిగి ఉండి, రేషన్ కార్డుకి ఆధార్ లింక్ చేసుకుని ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో మండలంలోని పలు రేషన్ సెంటర్లలో వృద్ధులకు చిన్న పిల్లలకు వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ షాప్ దారులు ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డు దరఖాస్తు చేసుకోవాలన్నా కొత్తగా పెళ్లి చేసుకుని వచ్చిన వారి చిరునామా మార్పుతో పాటు ఆధార్ కార్డులో తప్పుల సవరణకు దేవరకొండ వరకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొన్నది. తీరాఅక్కడికి వెళ్ళాక ఇంటర్నెట్ ఇతర సాంకేతిక సమస్యలతో పనులు జరగడం లేదని, అక్కడ పట్టణ ప్రజలతో పాటు ఇతర మండలాల ప్రజలు కూడా రావడంతో రద్దీ నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో చింతపల్లిలో 1, కురుమేడులో 1,నాంపల్లి 1,కొండమల్లపల్లి 1, దేవరకొండలో 2 ఉన్నఆధార్ కేంద్రాలు బ్లాక్ అవడంతో ఆధార్ కార్డులో పుట్టిన తేదీ సవరించాల్సి వస్తే అదేవిధంగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాల్సి వస్తే ఆధార్ సెంటర్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది తీరా అక్కడికి వెళ్ళాక సర్వర్ లేకపోవడంతో సమయం డబ్బు వృధా అవుతుంది కనుక చింతపల్లి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆధార్ కార్డు నమోదులో పదాల మిస్టేక్స్ కు లిమిట్ ఉంటుంది ఆ లిమిట్ దాటి పోవడం వల్ల గతంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని ఏడాదికృతమే బ్లాక్ చేశారు ఇప్పటికైనా ప్రజా సమస్యలను పరిగణలోకి తీసుకొని ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆధార్ సెంటర్లు అందుబాటులో ఉంటే ప్రజలకు ఇబ్బందులు ఉండవు.ఆధార్ అవస్థలు అన్నీ ఇన్నీ కావు.. ప్రస్తుతం ఏ పనికావాలన్నా ఆధార్ ఉండాల్సిందే.. అది లేకపోతే పని జరగడం లేదు. పోనీ ఆధార్ చేయించుకుందామంటే ఆ అవకాశమూ లేదు. ఎందుకంటే ఆధార్ కేంద్రం మూతపడిపోయింది. ఎండి అబ్దుల్ చింతపల్లి ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఆధార్ మార్పులకు, చేర్పులకు జనాలు అష్టకష్టాలు పడుతున్నారు. దిక్కుతోచక 30 కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుంది అయినా అక్కడ ఒక్కరోజులో పని కావడం లేదు. తోడేటి రవి నసర్లపల్లి చింతపల్లి మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. మరి ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ నమోదు సెంటర్ నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో గత ఏడాది నుండి మూతపడి ఉండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పునరుద్ధరించాలో. కానూరు దుర్గయ్య నరసింహ్మాపురం

## విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలంటే.. కనీసం ఇంత బడ్జెట్ కేటాయించాల్సిందే!




NEP--2020 ద్వారా 'నిపుణ్ భారత్' కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ' పేరుతో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో కనీస సామర్థ్యాల పెంపుతో పాటు అభ్యసన ఫలితాలు రాబట్టడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి. పలు రాష్ట్రాలు వీటిని అనుసరిస్తూనే ఆయా రాష్ట్రాలకు అనుగుణంగా ప్రత్యేకంగా, అదనంగా

ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి. తరగతి గదిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు కాలానుగుణంగా సాంకే తిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకొని ఎప్పటి కప్పుడు నవీకరణ చెందవలసిన ఆవశ్యకత ఉన్నది. అందుకే వారికి బోధనలో సరికొత్త మెలకువలను, బోధనకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంతో పాటు నూతన వ్యూహా లకు పదును పెట్టడానికి గాను తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(ఎస్సీఈఆర్టీ) నిత్యం ఉపాధ్యాయ లోకాన్ని సన్నద్ధం చేస్తున్నది. అందులో భాగంగానే పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే వేసవికాలంలో వృత్యంతర శిక్షణకు శ్రీకారం చుట్టింది.

### కనీస సామర్థ్యాల పెంపు కోసం..

ప్రాథమిక స్థాయి పిల్లలకు గట్టి పునాది వేయాలనే ఆశయంతో మరి కొన్నింటిని జోడించుకుంటున్నాయి. ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో గణితం, భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించడంతో పాటు ఇప్పుడు పరిసరాల విజ్ఞానాన్ని కూడా మూల్యాంకనం చేయనున్నారు. అంతేకాకుండా దీనికి కృత్రిమ మేధను జోడించి గణితంలో, భాషా పరిజ్ఞానంలో పిల్లల్లో మరింత ఆసక్తిని పెంపొందించే ఉద్దేశ్యంతో సాంకే తిక సాధనాలను రూపకల్పన చేశారు. ఐటీ హబ్‌గా ఆవి ర్భావం చెందుతున్న తెలంగాణ దేశంలోనే ముందు వరు సలో ఉందని, పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

### ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) అనుసరించి దేశంలో తెలంగాణ రాష్ట్రం విద్యా ప్రగతి నివేదికలో అట్టడుగు స్థాయిలో ఉన్నప్పటికీ.. కరోనా తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాల నివేదికల్ని పరిశీలిస్తే గతంతో పోలిస్తే విద్యా ప్రగతి 6 శాతం వృద్ధి చెందినదని నివేదిక పేర్కొనడం విశ్లే షకుల్ని సైతం ఆశ్చర్యపరిచింది. దీనికి ప్రధాన కారణం ఉపాధ్యాయులకు నిరంతరం అందిస్తున్న శిక్షణే అని తేట తెల్లమైంది. కానీ కేవలం శిక్షణ ద్వారా మాత్రమే విద్యా ప్రగ తిలో అనుకున్న స్థాయిని అందుకోలేమని దానికి ప్రభు త్వం కూడా నిర్మాణాత్మక చేయూత అందించవలసి ఉన్న దని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని పాఠ శాలలు ఉపాధ్యాయ కొరతను ఎదుర్కొంటుండగా మరికొన్ని పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. మరో పక్క బహుళ తరగతి బోధన, బహుళ స్థాయి బోధన ఒక సవా లుగా నిలుస్తున్నది. దీన్ని అధిగమించడానికి విద్యార్థులు తక్కువ నమోదు ఉన్న పాఠశాలలను సమీప పాఠశాలలో విలీనం చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు అనే కోణాన్ని ఆవిష్కరించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయా లని విద్యాభిమానులు కోరుకుంటున్నారు.

### కనీసం 20 శాతం కేటాయిస్తే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014-15 బడ్జెట్‌లో 10.89 శాతం నిధులు విద్యకు కేటాయించారు. ఆ తరువాత ప్రతి సంవత్సరం ఆ కేటాయింపు తగ్గించుకుంటూ గత బడ్జెట్ నాటికి 7.6 శాతానికి కుదించబడింది. ఇది చాలా విచారకరం, బడ్జెట్లో విద్యకు కేటాయింపు పెంచడం ద్వారా ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచవచ్చు. ఆహ్లాదకర, ఆకర్షణీయ వాతావరణాన్ని పాఠశాలలో నిర్మాణం చేయవచ్చు. తద్వారా సమాజాన్ని భాగస్వా మ్యం చేయవచ్చు. ప్రభుత్వ విద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలంటే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయిం చాలని అలా కాకున్నా కనీసం 15 శాతం నుంచి 20శాతంవరకు కేటాయించాలనివిశ్లేషకులుఅభిప్రాయపడుతున్నారు.

## ఏఐ సైన్స్ ఫిక్షన్ కాదు.. దాని చుట్టూనే యావత్ ప్రపంచం




"ఏఐ ని పిలవడం అంటే పిశాచాన్ని పిలిచినట్టే" అని ఎలాన్ మస్క్ అన్నప్పుడు, అతని హెచ్చరిక మన భవిష్యత్తుపై ఒక తీవ్ర మైన ప్రభావాన్ని చూపింది. కానీ ఈ హెచ్చరికలను లక్ష్యపెట్టకుండా ఏఐ అనే శక్తి ఇప్పటికీ మానవాళిని ఆకర్షిస్తూ ముందుకు దూసుకుపోతోంది. మన ఫోన్‌లోని వాయిస్ అసిస్టెంట్ల నుంచి, డ్రైవర్ లేకుండా నడిచే కార్ల వరకూ, ఈ ఏఐ సైన్స్ ఫిక్షన్ కాదని స్పష్ట మైంది. గూగుల్, ఫేస్‌బుక్ వంటి "డేటా ఆధారిత" దిగ్గజ సంస్థలు ఈ రంగంలో మరింత వేగంగా దూసుకుపోతున్నాయి. ఈ వేగవంతమైన మార్పును అర్థం చేసుకోవడానికి మనం కొత్త రకమైన అక్షరాస్యతను, అంటే "%రూ×% లిటరసీ"ని మన పాఠశాలల్లో, ఉన్నత విద్యాసంస్థల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు ఏఐని ఉపయోగించని రంగం అంటూ ఏదీ లేదు. విద్యా, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, క్రీడలు, సంగీతం, వినోదం, రవాణా, ఆటోమొబైల్, యుద్ధ రంగం ఇలా అన్ని చోట్లా కృత్రిమ మేధ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఇకపై ఏఐ వాడకం గురించి తెలియని వారు అనాగరిక జనాభాలో చేరిపోతారు.

### ఏఐ లిటరసీ అత్యవసరం!

ఏఐ అంటే కేవలం యంత్రాలు పని చేయడమే కాదు. అవి మానవ బుద్ధిని అనుకరిస్తూ, నేర్చుకుంటూ, సమస్యలను పరిష్కరిస్తూ పని చేస్తాయి. ఎలాన్ ట్యూరింగ్ నమూనాలో మానవులతో సమానంగా మాట్లాడగల చాట్‌బాట్లు, సమర్థంగా లక్ష్యాలను చేరుకునే రేషనల్ ఏజెంట్లు మొదలైనవి అన్నీ ఏఐ పరిమితులను విస్తరించాయి. కానీ ఈ శక్తి అనేక సవాళ్లను కూడా తీసుకొచ్చింది. ఓపెన్ ఏఐ 03, గూగుల్ జెమిని - 2.5 వంటి తాజా మోడల్స్ నూతన దిశగా దూసుకుపోతున్నాయి. వెబ్‌లో తాము శోధించి, కోడ్ రాసి, గ్రాఫ్‌లు రూపొందించి, వివిధ మాధ్యమాలను కలిపి మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏఐ లిటరసీ మనకు అత్యవసరం. ఇది కేవలం టెక్నాలజీని ఉపయోగించడమే కాదు. దాని వెనుకున్న విధానాలను కూడా అర్థం చేసుకోవడం. వాటి పరిమితులను గుర్తించడం కూడా అవసరమే. కనుక, ఏఐ సామాజిక ప్రభావాలను, మానవ హక్కులపై దాని ప్రభావాన్ని విశ్లేషించ గలగడం కూడా ముఖ్యమే. వ్యక్తిగత డేటా భద్రత, సమాచారం వాస్తవికత, నైతికత ఇవి అన్నీ ఈ అక్షరాస్యతలో ఇమిడి ఉన్న భాగాలే..




### ఏఐ చుట్టూ యావత్ ప్రపంచం

ఇప్పుడు ప్రపంచం మొత్తం ఈ కృత్రిమ మేధ చుట్టూ తిరుగుతోంది. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, అమెరికా, చైనా మొదలైన అభివృద్ధి చెందిన దేశాలన్నీ తమ జాతీయ విద్యా విధానంలో ఏఐ నైపుణ్యాలను తమ విద్యార్థులకు నేర్పించే పనిలో పడ్డారు. భవిష్యత్ విద్యా వ్యూహాల్లో విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. యునెస్కో, ఐ.ఎఫ్.ఎల్.ఏ వంటి సంస్థలు కూడా ఏఐని అర్థం చేసుకునే సామర్థ్యాలను తమ దేశ ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని ప్రణాళికలు వేస్తున్నాయి. మూడవ ప్రపంచ దేశాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి దేశాలు కూడా ఈ మార్గాలను వేగంగా అనుసరించే పనిలో నిమగ్నమై ఉన్నాయి. అయితే ఈ కార్యక్రమాలలో లైబ్రరీలు కీలక పాత్ర పోషిస్తాయి. డేటా నిర్వహణలో, సమాచార సేకరణ పరిజ్ఞానంలో నిపుణులైన లైబ్రేరియన్లు సామాజికంగా బాధ్యతగల ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడంలో మార్గనిర్దేశకులవుతారు. ఫేక్ న్యూస్‌ను నివారించటం, "ఆల్గోరిథమిక్ బైయాస్" వంటి సమస్యలను ప్రజలకు వివరించి, వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంలో గ్రంథాలయాలు సమర్థవంతంగా ఉపయోగపడతాయి.

### ఏఐ శాపం కాదు.. శ్రేయోమార్గం

ఇప్పుడు ఏఐ మానవునికి నమ్మదగిన సహచరిగా మారుతోంది. ఇది సాధారణ పరికరంగా కాకుండా, సమాచారాన్ని విశ్లేషించి, దాని ఆధారంగా చర్యలు తీసుకునే శక్తిగా రూపాంతరం చెందుతోంది. ఇలాంటి శక్తిని సమర్థవంతంగా, నైతికంగా ఉపయోగించాలంటే, మనం కృత్రిమ మేధ అక్ష రాస్యతను కొత్త తరానికి మూలాధారంగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడు మాత్రమే మనం ఈ శక్తిని శాపంగా కాక, శ్రేయస్కర మార్గంగా మార్చగలుగుతాం.

నేటి ప్రభాత సూర్య జాతీయ తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# ఆయుధాల పందేరం!

## (విశ్లేషణ)

రాజ్యాంగాన్ని మనం అమలు చేసుకోవటం మొదలెట్టి 75 ఏళ్లవుతుండగా మన పాలకుల విపరీత పోకడలు దాన్ని కాస్తా భ్రష్టుపట్టించే దిశగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దులకు సమీపంగా వుండే మారుమూల ప్రాంతాల్లోని స్థానిక తెగలకూ, నివాసితులకూ ఆయుధాల లైసెన్స్‌లుమంజూరు చేయాలని అస్సాం మంత్రివర్గం బుధవారం నిర్ణయించటం ఆ కోవలోనిదే.సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ కోసం, వ్యక్తిగత భద్రత కోసం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు.'జాతి, నేల, స్థానికత' కాపాడటం కోసమే ఇలా చేస్తున్నామని ఆయన ప్రకటించారు. బంగ్లాదేశ్ పొడవునావుండే రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఈ ఆయుధాల లైసెన్స్‌లు లభిస్తా యని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాలన్నిటా ముస్లింల జనాభా ఎక్కువ. ఇప్పుడు జనం చేతికి తుపాకులందితే మత ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా తుపాకులు మాట్లాడటం మొదలవుతుంది. ఇది ప్రభుత్వానికి మంచిదేనా? 1985 నుంచీ ఆ ప్రాంతాలవారు ఈ లైసెన్స్‌ల కోసం డిమాండ్ చేస్తుంటే గత ప్రభుత్వాలేవీ సాహసించలేదని, వాటికి ధైర్యంలేదని శర్మ వివరిస్తున్నారు.ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకొనేది తమకు రక్షణ, భద్రత కల్పిస్తాయని, మౌలిక సదుపాయల కల్పనపై శ్రద్ధ పెడతాయని, తమ బతుకులు మెరుగుపరచటానికి అవసరమైన పథకాలు రూపొందిస్తాయని ఆశించబట్టే! ఇంతకూ 'ధైర్యం లేని' గత ప్రభుత్వాల్లో తాను మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ ప్రభు త్వాలున్నట్టేనా? ఆ కాలాల్లోని ప్రభుత్వాలకు 'ధైర్యం' కలిగించేందుకు తాను చేసిందేమిటి? తాను విఫలమైన పక్షంలో దానిపై నిలదీయకుండా మౌనంగా ఎందుకు ఉండిపోయినట్టు?దాదాపు పాతికేళ్లుగా శర్మ రాజకీయాల్లో వుంటున్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 2015లో కాంగ్రెస్ నుంచి తప్పుకోవటానికి కూడా కారణం ఆ సర్కార్‌కు ధైర్యం లేదని కాదు. తన రాజకీయ ఎదుగుదలకు అప్పటి సీఎం తరుణ్ గొగోయ్ అడ్డంకిగా మారటం! దీన్నంతటినీ రాహుల్‌గాంధీని కలిసి మొరపెట్టుకోవాలని శర్మతీవ్రంగా ప్రయత్నించారు. కానీ జనాదరణగల యువ నాయకుల కన్నా పీఠాధిపత్యం నెరపే వృద్ధ తరం నేతలకే పెద్దపీట వేసే సంస్కృతిగల కాంగ్రెస్‌లో అది సాధ్యపడలేదు.నేపథ్యం ఏమైనా బీజేపీలో శర్మ బాగా రాణించారు. ఏనాటినుంచో ఆ పార్టీలో వున్న నేతలను తలదన్నే విధంగా ప్రకటనలిచ్చి వివాదాస్పదుడూ అయ్యారు. అందువల్ల పార్టీలో ఆయన పట్టు పెరిగింది గనుకే 2021లో బీజేపీ అధిష్ఠానం శర్మను అస్సాం ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. కానీ గత ప్రభుత్వాలు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వకపోవటానికి వాటికి ధైర్యం లేకపోబట్టే అని ఆయన దేని ఆధారంగా నిర్ణయానికొచ్చారో చెప్పలేదు. శర్మ చెబుతున్న ప్రకారం ఆ ప్రభుత్వాలు సాహసించలేక పోబట్టి చాలామంది స్థానిక తెగలవారు బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కణ్ణించి వలసలు పోవాల్సి వచ్చింది. మరి ప్రభుత్వాల వైఖరి వల్ల జనం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఆయన మౌనంగా మిగిలిపోవటం ఎందువల్ల? హిమంత గ్రహించాల్సిన విషయం ఒకటుంది. గతంలో ప్రజల నుంచి ఎన్ని డిమాండ్లు వచ్చినా అప్పటి ప్రభుత్వాలు ఆయుధ లైసెన్సులివ్వకపోవటానికి కారణం ధైర్యం లోపించి కాదు. అది అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని విశ్వసించటం వల్ల! అమెరికాలో పౌరులెవరైనా ఆయు ధాలు కొనుక్కోవచ్చు. అందుకు కొన్ని నిబంధనలున్నా ఆచరణలో అవి ఏమవుతున్నాయో అక్కడ తరచు జరిగే ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. అక్కడ సగటున 100 మంది పౌరులకూ 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు తుపాకీ మరణాలు 30,000 మించాయి.అకారణంగా లేదా భయపడి తరచు అవతలివారిని చంపుతున్న ఉదంతాలు ఎక్కువ. ఆ దేశంలో కూడా హిమంత ప్రభుత్వం ఏకరువు పెడుతున్న నిబంధల వంటివే వున్నాయి. మానసికంగా సక్ర మంగా వుండి అవతలివారి నుంచి ప్రాణభయం ఉన్న 21 ఏళ్లు పైబడినవారందరికీ లైసెన్సులిస్తా మని హిమంత చెబుతున్నారు. ఏదైనా కేసులో శిక్షపడినా, శాంతికి దోహదపడతామని గతంలో ప్రభుత్వానికి బాండు రాసిచ్చినా అనర్హులవుతారట. అంతేగాక మానసికంగా, శారీరకంగా సరైన స్థితిలో వున్నవారికే లైసెన్సులు జారీచేస్తారట. ఒకసారంటూ కళ్లెం వదిలాక ఇవన్నీ నిజాయతీగా, చిత్తశుద్ధిగా అమలవుతాయా? అనుమానమే! అస్సాం మొదటినుంచీ సమస్యాత్మక రాష్ట్రం. అక్రమంగా చొరబడిన విదేశీయులను వెనక్కిపంపాలంటూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం, అటుతర్వాత ఉల్ఫా లాంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు తెలియంది కాదు. నిత్యం అపహరణలు, డబ్బు దండుకోవటం, హత్యలు ఒకప్పుడు చాలా అధికం. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్లు, పోలీసులు ఉల్ఫా ఆటకట్టించాక అవి చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికీ బీఎస్ఎఫ్ జవాన్లు సరిహద్దుల్లో నిత్యం పహారా కాస్తుంటారు. సమస్య వుందనుకుంటే మరింతమందిని నియమించి, పటిష్ఠమైన పర్యవేక్షణ అమలు చేయటం పెద్ద కష్టం కాదు. అందుకు భిన్నంగా లైసెన్సులిస్తామంటే ప్రభుత్వం చేతులెత్తేసినట్టు కాదా? ఇలాంటి కారణాల వల్లే గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సుప్రీంకోర్టు సల్వాజుడుంను రద్దుచేసింది. పైగా అస్సాంకు భారీయెత్తున పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతూ శాంతికి విఘాతం కలిగించే ఇలాంటి విధానం అమలు చేయటం సరైందేనా? హిమంత ఆలోచించాలి.

# జగన్ తెనాలి పర్యటన వేళ ఊహించని రాజకీయం..!!

ఏపీలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. తెనాలిలో రౌడీ షీటర్ అనుచరులను పోలీసు లు కొట్టిన వీడియో వైరల్ అయింది. దీని పైన మాజీ సీఎం జగన్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రం లో రెడ్ బుక్ రాజ్యంగా నడుస్తోందని జగన్ ఆరోపించారు. నేరం చేసిన వారి పైన కఠినంగానే స్పందించాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తోంది. ఈ సమయంలోనే జగన్ పోలీసులు కొట్టిన విక్టర్ అనే వ్యక్తిని పరామర్శించేందుకు తెనాలి వస్తున్నారు. ఇప్పుడు ఈ పర్యటన వేళ కొత్త వివాదం మొదలైంది. మాజీ సీఎం జగన్ (మంగళవారం) తెనాలిలో పర్యటించనున్నారు. ఇటీవల పోలీసుల దాడిలో గాయపడ్డ జాన్ విక్టర్ కుటుంబాన్ని జగన్ పరామర్శించనున్నారు. ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి తెనాలికి చేరుకుంటారు. పోలీసులు దలిత, మైనారిటీ యువకులను బహిరంగంగా కొట్టటం ఇప్పటికే జగన్ స్పందించారు. మానవ హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. జగన్ తెనాలి పర్య టనలో నందివెలుగు నుంచి ఇతానగర్ వరకు జగన్ రాకతో భారీ బైక్ ర్యాలీ జరగనుంది. కాగా, తెనాలిలో రౌడీ షీటర్లపై పోలీసులు ఓపెన్ ట్రీట్ మెంట్‌పై హెూంమంత్రి అనిత స్పందించారు. శాంతి భద్రతలను కంట్రోల్ చేయాల్సింది పోలీసు లేనని తెలిపారు. తప్పు చేసిన వారికి కులం ఏంటి మతం ఏంటని ప్రశ్నించారు. పోలీసులపై దాడి చేసే వారికి కూడా రాజకీయ రంగు పులమటం ఏంటని నిలదీశారు. కొద్ది రోజుల క్రితం తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు యువకులు మద్యం మత్తులో కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేశారు. పట్టణ సమీపంలో ముగ్గురు యువకులు కూర్చొని మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన కానిస్టేబుల్ ను పిలిచి అతనిపై దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు సీరియస్ అయ్యారు. ఈ ముగ్గురిని జాన్ విక్టర్, షేక్ బాబూలాల్, రాకేష్ గా గుర్తించారు. వీరంతా రౌడీ షీటర్ లడ్డూ అనుచరులుగా తేల్చారు. ఏకంగా కానిస్టేబుల్ పై దాడి చేయడాన్ని తీవ్ర నేరంగా భావించిన పోలీసులు వారి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు నడిరోడ్డు మీద లాఠీలతో తీవ్రంగా కొట్టిన వీడియో వైరల్ అయింది. అయితే పోలీసు లపై దాడి చేశారని, గంజాయి మత్తులో దారుణాలకు పాల్పడుతున్న వారికి బుద్ధి చెప్పాలని అంతా చూస్తుండగానే వారికి బుద్ధి చెప్పినట్లు చర్చ జరుగుతోంది.



### సజ్జలకి రూట్ క్లియర్ చేసిన సాయిరెడ్డి – జగన్ తాజా నిర్ణయంతో..!!

కానిస్టేబుల్ పైన హత్యాయత్నా నికి పాల్పడిన వారికి మద్దతు తెలపటం పైనా కానిస్టేబుల్ సతీమణి ప్రశ్నిస్తున్నారు. తన భర్తకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేసారు. జగన్ ఈ ఘటన పైన ఘాటుగా స్పందించారు. వారిని రోడ్డుపై కూర్చోబెట్టవలసి వచ్చింది మరియు పదేపదే వారి కాళ్లపై లాఠీలతో కొట్టినట్లు వీడియోలో కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ ఘటన దాదాపు నెల రోజుల తరువాత బయటకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో భయం, బెదిరింపు లతో పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ దాడి మావన హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. ఇక, తెనాలి ఘటన పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్న సమయంలో జగన్ పర్యటన రాజకీయ వివాదంగా మారే అవకాశంగా కనిపిస్తోంది.

# కవిత కు తేల్చి చెప్పిన హరీష్ – కేసీఆర్ ది ఇదే ఫైనల్ డెసిషన్..!!

తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కవిత లేఖ.. తదనంతర పరిణామా లతో బీఆర్ఎస్ లో కలకలం మొదలైంది. కవిత పరోక్షంగా కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ కేసీఆర్ కు తన మద్దతు ప్రకటిస్తున్నారు. కేటీఆర్ కు కాళేశ్వరం నోటీసులకు నిరసనగా ధర్నాకు కవిత నిర్ణ యించారు. ఇదే సమయంలో కవిత వరుసగా చేస్తున్న బీజేపీలో బీఆర్ఎస్ విలీనం పైన సీనియర్ నేత హరీష్ స్పందించారు. కేసీఆర్ నిర్ణయం ఏంటో తేల్చి చెప్పారు. హరీష్ వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో వైరల్ అవుతున్నాయి.



### కీలక మలుపు

ఎమ్మెల్సీ కవిత వివాదం బీఆర్ఎస్ లో దుమారానికి కారణమైంది. కేసీఆర్ కు తనను దూరం చేస్తు న్నారంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. తన అన్న కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ పలు వ్యాఖ్య లు చేయటం సంచలనంగా మారింది. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే వర్కింగ్ ప్రెసిడెంట్ ట్విట్టర్ లో స్పందిస్తే సరి పోతుందా అని ప్రశ్నించారు. కొత్త పార్టీ ఆలోచన లేదని స్పష్టం చేసిన కవిత తన తండ్రిని.. ఉన్న పార్టీని కాపాడుకోవటం తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన సంస్థ జాగృతి బలో పేతం పైన ఫోకస్ చేసారు. కేటీఆర్ ను ఫిక్స్ చేసే విధంగా తన తండ్రికి కాళేశ్వరం కమీషన్ జారీ చేసిన నోటీసులకు నిరసనగా ఈ నెల 4న ధర్నాకు పిలుపునిచ్చారు. ఇక, కవిత వ్యవహారం పైన కేసీఆర్ ఆచి తూచి వ్యవహరిస్తున్నారు.

### హరీష్ క్లారిటీ

కవిత అంశం పైన ఎవరూ స్పందించ వద్దని పార్టీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కవిత టార్గెట్ చేస్తున్న వేళ కేటీఆర్ వ్యూహాత్మకంగా విదేశీ పర్యటనకు వెళ్లారు. కవిత అంశం పైన హరీష్ తో పాటుగా కొందరు ముఖ్య నేతలతో మాత్రమే కేసీఆర్ స్పందించారు. ఇక, ఇప్పుడు హరీష్ ఇప్పటి వరకు కవిత చేస్తున్న కామెంట్స్ కు సమాధానం ఇచ్చారు. కవిత పదే పదే బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారం పైన స్పందించిన హరీష్ బీఆర్ఎస్ కు ఏ పార్టీతో పొత్తు ఉండదని తేల్చి చెప్పారు. ఒంటరిగానే బీఆర్ఎస్ ఎన్నికల్లో పోటీ చేస్తుందని.. కేసీఆర్ నాయకత్వంలోనే తామంతా పని చేస్తామని స్పష్టం చేసారు. ఎక్కడా కేటీఆర్ ప్రస్తావన చేయలేదు. కవిత చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవం లేదనే విధంగా హరీష్ క్లారిటీ ఇచ్చారు.

### మళ్లీ అధికారంలోకి

కేసీఆర్ నాయకత్వంలో ఒంటరిగానే బీఆర్ఎస్ పోటీ చేసి.. వంద సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తుందని హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే రెడ్‌బుక్‌లో పేర్లు రాసు కుంటామని పోలీస్, ఇతర అధికారులను హెచ్చరించారు. జాగ్రత్త , రాబోయేది తమ ప్రభుత్వమే నని వార్నింగ్ ఇచ్చారు. చంద్రబాబుకు భయపడి తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసింది బీజేపీ నే అని హరీష్‌రావు విమర్శించారు. బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను రూ.12 వేల కోట్లతో నిర్మిస్తున్నారని.. వీటి పనులను నలుగురు బడా కాంట్రాక్టర్లకే కట్టబెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర బీజేపీ నేతలకు దమ్ముంటే ఈ ప్రాజెక్ట్‌ను ఆపాలని సవాల్ విసిరారు. బనకచర్ల అక్రమ ప్రాజెక్ట్‌కు అనుమతి ఇచ్చి తెలంగాణకు అన్యాయం చేస్తుంది బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు.

# మహిళలకు కొత్త వరం ప్రకటించిన సీఎం రేవంత్..!!

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే తమ ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలి పారు. రాష్ట్రం వచ్చి పదేళ్లు అయినా ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి.. ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు క్యూ ఆర్ కోడ్ తో కూడిన ప్రత్యేక కార్డులు అందజేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.



### మహిళల కోసం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల వేళ సీఎం రేవంత్ కీలక ప్రకటన చేసారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జపాన్‌లోని కితాక్యూషూ సిటీ మేయర్ టేకుచి పాల్గొన్నారు. దశాబ్దాల పోరాటంతో తెలంగాణను సాధించుకున్నామని ఉద్ఘాటించారు. సకల జనుల ఆకాంక్షలు నెరవేరిన రోజు అని అభివర్ణించారు. తాము అధికారం చేపట్టే నాటికి వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆడబిడ్డలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తు న్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని గుర్తుచేశారు. ధాన్య ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఉపయోగపడేలా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ధరణి కొందరికి చుట్టమైతే.. భూభారతి ప్రజలకు రక్షణ చట్టమని మఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




### పునర్నిర్మాణం

తాము బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని రేవంత్ గుర్తు చేసారు. వ్యవ స్థలన్నీ నిర్వీర్యమ య్యాయన్నారు. జరిగిన తప్పిదాలను సరిదిద్ది రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సి న బాధ్యత తమ పై ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలనే ప్రజా ప్రభుత్వ ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదిలామని వివరించారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను కల్పించే పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించామని చెప్పారు. దేశం లో అదానీ, అంబానీలతో పోటీ పడేలా మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాం. పెట్రోల్ బంకులు, పాఠశాలల నిర్వహణ, యూనిఫాంల కుట్టు పనితో పాటు మహిళా శక్తి క్యాంటీన్లను నిర్వహించేలా మహిళలను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడిం చారు. మహిళా సంఘాల ద్వారా 600 బస్సలు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ఆలోచన చేశామని చెప్పారు.

### హామీలు నెరవేరుస్తాం

బస్సులను వారికి అందజేసి రాష్ట్ర ఆర్థిక నిర్మాణంలో మహిళలను భాగస్వాములను చేస్తున్నామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నట్లు గుర్తు చేసారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్లు సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశామని చెప్పుకొచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ప్రతీ సంవత్సరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ వివరాలతో పాటు పూర్తి వివరాలను ఆ కార్డులో పొందుపరుస్తామని వెల్లడించారు. మెరుగైన విద్య వ్యవస్థ ఏర్పాటుకు సమగ్ర విధానాన్ని రూపొం దించాలని కమిషన్ ను ఆదేశించామని రేవంత్ వివరించారు. తొలి దశలో రూ.11,600 కోట్లతో 58 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు.




# ఓటమి బాధలో ఉన్న హార్దిక్ పాండ్యాకు భారీ షాకిచ్చిన బీసీసీఐ




ఐపీఎల్ 2025లో భాగంగా నిన్న (జూన్ 1) జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. తద్వారా ముంబై ఇంటికి, పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు చేరాయి. జూన్ 3న జరుగనున్న ఫైనల్లో పంజాబ్.. ఆర్సీబీతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ కూడా అహ్మదాబాద్ వేదికగా జరుగనుంది. కాగా, ఓటమి బాధలో ఉన్న ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు బీసీసీఐ భారీ షాకిచ్చింది. ఈ సీజన్‌లో మూడోసారి స్లో ఓవర్ రేట్ మెయింటైన్ చేసినందుకు గానూ రూ. 30 లక్షల జరిమానా విధించింది. ముంబై ఇండియన్స్‌లోని సభ్యులందరికీ కూడా 50 శాతం (రూ. 12 లక్షలు) మ్యాచ్ ఫీజ్ జరిమానాగా పడింది. ఈ సీజన్‌లో రూల్స్ మారడంతో హార్దిక్ సస్పెన్షన్ ను?ంచి తప్పించుకున్నాడు. ఈ సీజన్‌కు ముందు వరకు ఓ సీజన్‌లో మూడు మ్యాచ్‌ల్లో స్లో ఓవర్ రేట్ మెయింటైన్ చేస్తే ఓ మ్యాచ్ సస్పెన్షన్ విధించేవారు.

ఇదే మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా జరిమానా పడింది. ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్ రేట్ మెయింటైన్ చేయడంతో రూ.24 లక్షల ఫైన్ విధించారు. పంజాబ్ జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం (ఇందులో ఏది తక్కువైతే అది జరిమానా విధిస్తారు) కోత విధించారు. ఇదిలా ఉంటే, నిన్నటి మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44బీ 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 44బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37బీ 7 ఫోర్లు) దంచేశారు. అజ్మతుల్లా ఒమర్జాయ్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసి గెలిచింది. నాయకుడు శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 87 నాటౌట్‌బీ 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) జట్టు గెలిచేదాకా నడిపించాడు. నేహల్ వధేరా (29 బంతుల్లో 48బీ 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

# హెన్రిచ్ క్లాసెన్ షాకింగ్ నిర్ణయం

సౌతాఫ్రికా విధ్వంసకర ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. 33 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటన క్రికెట్ ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసింది. క్లాసెన్ ఈజీగా మరో రెండు, మూడేళ్లు అంతర్జాతీయ కెరీర్‌ను కొనసాగించి ఉండవచ్చు. మరో విధ్వంసకర బ్యాటర్, ఆసీస్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే క్లాసెన్ రిటైర్మెంట్ ప్రకటన రావడంతో వారివారి దేశ క్రికెట్ అభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మ్యాక్స్‌తో పోలిస్తే క్లాసెన్‌కు వయసు, ఫామ్ రెండూ ఉన్నాయి. పైగా 2027లో సౌతాఫ్రికాలో వన్డే వరల్డ్‌కప్ జరుగనుంది. క్లాసెన్ ఈ టోర్నీ ఆడతాడని ఆ దేశ అభిమానులు ఆశించి ఉంటారు. అయితే క్లాసెన్ షాకింగ్ నిర్ణయం తీసుకుని వారికి దుఖాన్ని మిగిల్చాడు. ఈ ఏడాది స్టార్ క్రికెటర్లు ఒక్కొక్కరుగా రిటైర్మెంట్ ప్రకట స్తూ వస్తున్నారు. రోహిత్, కోహ్లి టెస్ట్‌లకు.. స్టీవ్ స్మిత్, మ్యాక్స్‌వెల్ వన్డేలకు.. తాజాగా క్లాసెన్ మూడు ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు. 2018లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన క్లాసెన్.. సౌతాఫ్రికా తరఫున 4 టెస్ట్‌లు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఇందులో 4 సెంచరీలు (వన్డేల్లో), 16 హాఫ్ సెంచరీల సాయంతో 3245 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినా క్లాసెన్ ఐపీఎల్ తదితర లీగ్‌ల్లో కొనసాగుతాడు. క్లాసెన్ ఇటీవలే ఐపీఎల్‌లో సెంచరీ బాది వార్తల్లో నిలిచాడు. కేకేఆర్‌తో జరిగిన తమ చివరి మ్యాచ్‌లో క్లాసెన్ కేవలం 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 105 (నాటౌట్) పరుగులు చేశాడు. క్లాసెన్‌కు ఐపీఎల్‌లో ఇది రెండో సెంచరీ. ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన క్లాసెన్ 172.70 స్ట్రయిక్‌రేట్‌తో 487 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో క్లాసెన్ ప్రాతినిధ్యం వహించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఈ సీజన్ మెగా వేలానికి ముందు సన్‌రైజర్స్ యాజమాన్యం క్లాసెన్‌ను రీటైన్ చేసుకుంది.




# చరిత్ర సృష్టించిన సూర్యకుమార్ యాదవ్

ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. క్యాష్ రిచ్ లీగ్‌లో ఓ సింగిల్ సీజన్‌లో 700 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించిన తొలి ముంబై ఇండియన్స్ బ్యాటర్‌గా, ఐపీఎల్‌లో ఈ ఘనత సాధించిన తొలి నాన్ ఓపెనర్‌గా రికార్డు నెలకొల్పాడు. నిన్న (జూన్ 1) పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌తో కలుపుకొని స్కై ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 167.92 స్ట్రయిక్‌రేట్‌తో 65.18 సగటున, 5 హాఫ్ సెంచరీల సాయంతో 717 పరుగులు చేశాడు. స్కై ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. సూర్యకుమార్ తర్వాత ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ముంబై ఇండియన్స్ ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. సచిన్ 2010 సీజన్‌లో 618 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో స్కై సచిన్ రికార్డును అధిగమించాడు.

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్-6 ఆటగాళ్లు..

సాయి సుదర్శన్-15 మ్యాచ్‌ల్లో 759 పరుగులు

సూర్యకుమార్ యాదవ్- 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు

శుభ్‌మన్ గిల్-15 మ్యాచ్‌ల్లో 650 పరుగులు

మిచెల్ మార్ష్- 13 మ్యాచ్‌ల్లో 627 పరుగులు

విరాట్ కోహ్లి-14 మ్యాచ్‌ల్లో 614 పరుగులు

శ్రేయస్ అయ్యర్-16 మ్యాచ్‌ల్లో 603 పరుగులు

ఈ సీజన్‌లో స్కై మరో ఘనత కూడా సొంతం చేసుకున్నాడు. వరుసగా 16 ఇన్నింగ్స్‌ల్లో 25 ప్లస్ స్కోర్లు చేశాడు. క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలో ఎవరూ వరుసగా ఇన్ని ఇన్నింగ్స్‌ల్లో 25 ప్లస్ స్కోర్లు చేయలేదు. స్కై తర్వాత అత్యధికంగా రాబిన్ ఉతప్ప వరుసగా 10 ఇన్నింగ్స్‌ల్లో 25 ప్లస్ స్కోర్లు చేశాడు (2014లో కేకేఆర్ తరఫున). స్కై, ఉతప్ప తర్వాత సాయి సుదర్శన్ (9, 2023-24, గుజరాత్), విరాట్ కోహ్లి (9, 2024-25, ఆర్సీబీ) అత్యధిక ఇన్నింగ్స్‌ల్లో (వరుసగా) ఈ ఘనత సాధించారు.

ఈ సీజన్‌లో స్కై చేసిన పరుగులు (తాజా ఇన్నింగ్స్‌తో మొదలు)..

44 (26), 33 (20), 57 (39), 73 నాటౌట్ (43), 24 (35), 48 నాటౌట్ (23), 54 (28), 40 నాటౌట్ (19), 68 నాటౌట్ (30), 26 (15), 40 (28), 28 (26), 67 (43), 27 నాటౌట్ (9), 48 (28), 29 (26)

ఐపీఎల్‌లో ఓ సీజన్‌లో 700 ప్లస్ పరుగులు చేసిన ఆటగాళ్లు..

విరాట్ కోహ్లి-973 (2016)
శుభ్‌మన్ గిల్-890 (2023)
జోస్ బట్లర్-863 (2022)
డేవిడ్ వార్నర్-848 (2016)
సాయి సుదర్శన్-759 (2025)
విరాట్ కోహ్లి-741 (2024)
కేన్ విలియమ్సన్-735 (2018)
క్రిస్ గేల్-733 (2012)
మైక్ హస్సీ-733 (2013)
డుప్లెసిస్-730 (2023)
సూర్యకుమార్ యాదవ్-717 (2025)
క్రిస్ గేల్-708 (2013)



ఇదిలా ఉంటే, ఈ సీజన్‌లో సూర్యకుమార్ చెలరేగినా ముంబై ఇండియన్స్ ప్రయాణం క్వాలిఫయర్-2లోనే ముగిసింది. నిన్న (జూన్ 1) పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్ల తేడాతో పరాజయంపాలై లీగ్ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో స్కై విలువైన ఇన్నింగ్స్ (26 బంతుల్లో 44బీ 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆడాడు. బ్యాటింగ్‌లో సత్తా చాటినా ముంబై బౌలర్లు 203 పరుగుల స్కోర్‌ను డిఫెండ్ చేసుకోలేకపోయారు. శ్రేయస్ అయ్యర్ (87 నాటౌట్) పంజాబ్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ గెలుపుతో పంజాబ్ ఫైనల్‌కు చేరింది. ఫైనల్లో ఆర్సీబీతో అమీతుమీ తేల్చుకుంటుంది.

## కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టిన శ్రేయస్ అయ్యర్! ధోని కూడా వెనకే..



శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీ వ్యూహాలు, బ్యాటింగ్ సత్తాతో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన క్వాలిఫైయర్ 2లో పంజాబ్ సూపర్ విక్టరీ సాధించింది. టాస్ సమయంలో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ మొదటి క్వాలిఫయర్‌లో ఓటమి ఒక చిన్న పొరపాటు అని, జట్టు దానిని మర్చిపోయిందని అన్నాడు. అన్నట్లే క్వాలిఫైయర్ 2లో జట్టును గెలిపించాడు. 41 బాల్స్‌లో 5 ఫోర్లు, 8 సిక్సులతో 87 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అయ్యర్ తన ఇన్నింగ్స్‌లో ఎనిమిది సిక్సర్లు బాదడంతో కెప్టెన్ విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టాడు. ఒక సీజన్‌లో కెప్టెన్‌గా అత్యధిక సిక్సులు కొట్టిన కెప్టెన్‌గా అయ్యర్ కొత్త చరిత్ర లిఖించాడు. ప్రస్తుత సీజన్‌లో అయ్యర్ 39 సిక్సర్లు బాదాడు. ఒక సీజన్‌లో ఒక కెప్టెన్ కొట్టిన అత్యధిక సిక్సర్లు ఇవే. 2016 ఐపీఎల్ ఎడిషన్‌లో కోహ్లీ కొట్టిన 38 సిక్సర్లను అయ్యర్ అధిగమించాడు.

ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్ 5 కెప్టెన్లు

39ఠి %-% శ్రేయాస్ అయ్యర్ (పంజాబ్ కింగ్స్), 2025

38 %-% విరాట్ కోహ్లీ (ఆర్సీబీ), 2016

31 %-% డేవిడ్ వార్నర్ (ఎస్ఆర్‌హెచ్), 2016

30 %-% ఎంఎస్ ధోని (సీఎస్‌కే), 2018

30 %-% కేఎల్ రాహుల్ (పంజాబ్ కింగ్స్), 2021

ఐపీఎల్ సీజన్‌లో అయ్యర్ తొలిసారిగా 600 పరుగుల మార్క్ దాటాడు. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లినప్పుడు అతను 519 పరుగులు సాధించాడు. ఇప్పుడు ఆ రికార్డును కూడా అయ్యర్ బ్రేక్ చేశాడు. పంజాబ్ కింగ్స్ బ్యాట్స్‌మన్ ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆల్ టైమ్ రికార్డును బద్దలు కొట్టడానికి అయ్యర్‌కు 67 పరుగుల దూరంలో ఉన్నాడు. ఆ రన్స్ చేస్తే కెఎల్ రాహుల్ (670) పేరిట ఉన్న రికార్డును అయ్యర్ బద్దలు కొట్టేస్తాడు. మరి ఫైనల్‌లో అయ్యర్ 67 రన్స్ చేస్తాడో లేదో చూడాలి.

# సౌతాఫ్రికా మాస్టర్ ప్లాన్.. ఇక ఆసీస్‌కు చుక్కలే







వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్(%ఔజ%)-2025 ఫైనల్‌కు సమయం ఆసన్నమవుతోంది. జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ వేదికగా జరగనున్న తుది పోరులో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి.

ఈ క్రమంలో సౌతాఫ్రికా క్రికెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్ కోసం తమ జట్టు బౌలింగ్ కన్సల్టెంట్‌గా ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం స్టువర్ట్ బ్రాడ్‌ను సీఎస్ఏ నియమించింది. ఫైనల్ మ్యచ్‌కు రెండు రోజుల ముందు ప్రోటీస్ జట్టుతో బ్రాడ్ చేరనున్నాడు.

లార్డ్స్ మైదానంలో పరిస్థితులపై బ్రాడ్‌కు పూర్తి స్థాయి అవగహన ఉంది. అతడు తన కెరీర్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఈ క్రికెట్ మక్కాలో ఆడాడు. ఈ నేపథ్యంలోనే అతడితో సీఎస్ఏ తమ కోచింగ్ స్టాప్‌లోకి చేర్చుకుంది.

**రికార్డుల రారాజు..**

కెరీర్‌లో 167 టెస్ట్‌లు, 121, వన్డేలు, 56 టీ20లు ఆడిన బ్రాడ్ ఎన్నో రికార్డులను నమోదు చేశాడు. టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు (604) తీసిన బౌలర్ల జాబితాలో

ఐదో స్థానంలో నిలిచిన బ్రాడ్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ పలు రికార్డులు నెలకొల్పాడు. టెస్ట్‌ల్లో బ్రాడ్

244 ఇన్నింగ్స్‌లు ఆడి 3662 పరుగులు చేశాడు. ఇతని ఖాతాలో సెంచరీ (169), 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

**డబ్ల్యూటీసీ ఫైనల్‌కు సౌతాఫ్రికా జట్టు**

టెంబా బావుమా (కెప్టెన్), ఎయిడెన్ మార్క్రమ్, లుంగి ఎంగిడి, టోనీ డి జోర్జి, డేవిడ్ బెడింగ్‌హమ్, కేశవ్ మహారాజ్, ట్రిస్టన్ స్టబ్స్, కార్బిన్ బాష్, సెనురన్ ముత్తుసామి, మార్కో జాన్సెన్, కగిసో రబాడ, కైల్ వెర్రెయిన్, డేన్ ప్యాటర్సన్, వియాన్ ముల్డర్, ర్యాన్ రికెల్టన్.

**డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆసీస్ జట్టు**

ఉస్మాన్ ఖ్వాజా, సామ్ కోన్‌స్టాస్, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, కామెరూన్ గ్రీన్, ఇంగ్లిస్, అలెక్స్ క్యారీ, వెబ్‌స్టర్, పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, హేజెల్‌వుడ్, స్కాట్ బోలాండ్, నాథన్ లయన్, మాథ్యూ కుహ్నెమాన్

# వర్షం అడ్డుపడినా ఫైనల్ మ్యాచ్ జరగాల్సిందే.. బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లతో రిజల్ట్ పక్కా..

: క్రికెట్ అభిమానుల ఆనందోత్సాహాల మధ్య ఐపీఎల్ 2025 చివరి దశకు చేరుకుంది. ఫైనల్ మ్యాచ్ కోసం సర్వం సిద్ధమవుతోంది. అయితే, చివరి మ్యాచ్‌కి వర్షం ముప్పు పొంచి ఉందనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోకుండా ఉండేందుకు బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఫైనల్ మ్యాచ్ ఎక్కడ? ఎప్పుడు?

ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జూన్ 3న జరగనుంది. ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ పంజాబ్ కింగ్స్ (%ూదీఖూ%) తలపడనున్నాయి.

వర్షం సూచనలు, బీసీసీఐ సన్నాహాలు..

అహ్మదాబాద్‌లో జూన్ 3న వర్షం పడే అవకాశం 62% వరకు ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఎడతెరిపి లేని వర్షం రాకపోయినా, అకస్మాత్తుగా వచ్చే జల్లులు మ్యాచ్‌కు అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితిని నివారించడానికి బీసీసీఐ పలు జాగ్రత్తలు తీసుకుంటోంది.

రిజర్వ్ డే: ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ కోసం బీసీసీఐ ఒక రిజర్వ్ డేను కేటాయించింది. ఒకవేళ జూన్ 3న వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దు అయితే, జూన్ 4న రిజర్వ్ డే రోజున మ్యాచ్‌ను నిర్వహిస్తారు. గతంలో 2023లో కూడా చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఫైనల్ వర్షం కారణంగా రిజర్వ్ డేకి మారింది. అదనపు సమయం: మ్యాచ్ ప్రారంభం ఆలస్యమైనా లేదా మధ్యలో వర్షం అంతరాయం కలిగించినా, మ్యాచ్ పూర్తి చేయడానికి అదనంగా 120 నిమిషాల (రెండు గంటల) సమయాన్ని బీసీసీఐ అనుమతించింది. కనీస ఓవర్లు: మ్యాచ్ ఫలితం తేలాలంటే కనీసం ఐదు ఓవర్ల ఆట జరగాలి. అంటే,




రెండు జట్లు కనీసం ఐదు ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయగలిగితేనే మ్యాచ్‌కు ఫలితాన్ని నిర్ణయిస్తారు. వర్షం కారణంగా రద్దు అయితే ఎవరు విజేత? ఒకవేళ రిజర్వ్ డే రోజు కూడా వర్షం వల్ల మ్యాచ్ జరగడానికి వీలు లేకపోతే, లీగ్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఈ ఏడాది పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. కాబట్టి, వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దు అయితే, పంజాబ్ కింగ్స్ జట్టును విజేతగా ప్రకటిస్తారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లీగ్ దశలో రెండో స్థానంలో ఉంది. ఫైనల్ మ్యాచ్‌కి ముందు వర్షం ముప్పు ఉన్నప్పటికీ, బీసీసీఐ తీసుకున్న ఈ ప్రత్యేక చర్యలు అభిమానులకు కాస్త ఊరటనిస్తున్నాయి. ఎందుకంటే, వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కాకుండా, ఒక కొత్త ఐపీఎల్ ఛాంపియన్ ఆవిర్భవించాలని అందరూ కోరుకుంటున్నారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com
బుధవారం - 04 - జూన్ - 2025

# సినిమా చిత్రం

## అనుష్క 'ఘాటి' నుంచి ఓ గుడ్ న్యూస్




వెండితెరకు అందరి కంటే కాస్త ఎక్కువ గ్యాప్ తీసుకుంటున్న సీనియర్ హీరోయిన్స్ లలో అనుష్క పేరు టాప్ లిస్ట్ లో ఉంది. చాలా కాలంగా పాత్రల కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు అనుష్క శెట్టి 'ఘాటి' సినిమాతో కచ్చితంగా ఆకర్షణీయమైన అనుభూతి ఇవ్వబోతోంది. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఇది వీరిద్దరి కలయికలో 'వేదం' తర్వాత వస్తున్న సినిమా కావడంతో అంచనాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ చిత్రంలో అనుష్క పాత్ర చాలా పవర్ఫుల్ గానూ, వైవిధ్య భరితం గానూ ఉండబోతోంది. గ్లింప్స్ లో లుక్ చూసినవాళ్లు ఆమె క్యారెక్టర్‌తో పాటు సినిమా కోసం కూడ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విక్రమ్ ప్రభు కథా నాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది కేవలం ప్రతీకారం కోసం నడిచే కథే కాదు, మానవ విలువల క్షీణత, కడుపు నింపడానికి చేసే పోరాటాన్ని చూపించే కథ అంటున్నారు మేకర్స్. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. జూలై 11న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నారు. విడుదల పోస్టర్ లో ప్రధాన పాత్రధారులు తమ భుజాలపై బరువులు మోస్తూ, నీటిలో నడుస్తూ వెళ్తున్న దృశ్యం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది సినిమాకు సంబంధించిన కంటెంట్ ను హైలెట్ చేస్తోంది. మాస్ ఎంటర్టైనర్ కాదు కానీ, ఈ కథ హృదయాలను తాకేలా ఉంటుందట. 'ఘాటి' అనే టైటిల్ కేవలం పేరుకే కాదు, కథలోని ప్రతి మూమెంట్ కూడా అదే స్థాయిలో ఆసక్తిగా ఉండబోతుందని సమాచారం. నిర్మాతలు **(యువి)** క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ కలిసి ఈ సినిమాను అత్యున్నత స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే టెక్నికల్‌గా, విజువల్స్ పరంగా మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇవ్వనుంది. దర్శకుడు క్రిష్ ఈ చిత్రంతో తన కెరీర్‌లో మరో బిగ్ హిట్ అందుకోవాలని చూస్తున్నాడు. వరుసగా డిఫరెంట్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న క్రిష్, ఈసారి అనుష్కను వినూత్నంగా చూపిస్తూ ప్రేక్షకులను శక్తివంతమైన కథలోకి తీసుకెళ్లనున్నాడు. మరి ఈ సినిమా అతనికి ఏ స్థాయిలో విజయాన్ని అందిస్తుందో చూడాలి.

## 'కూలీ' తెలుగు రైట్స్‌తో నాగ్ బిగ్ రిస్క్.. గ్రాస్ ఎంత రావాలి?

రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' సినిమా టాలీవుడ్‌లో భారీ హైప్‌ను సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రజనీకాంత్‌తో పాటు నాగార్జున, ఉపేంద్ర, శృతి హాసన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, రెబా మోనికా జాన్ వంటి స్టార్ కాస్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. అమీర్ ఖాన్ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నాడనే వార్త ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. అనిరుధ్ రవిచందర్ సంగీతం, గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీతో ఈ సినిమా టెక్నికల్‌గా బలంగా ఉంది. 'కూలీ' సినిమా గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే కథతో రూపొందుతోంది. ఈ సినిమా టీజర్‌లో రజనీకాంత్ గోల్డ్ చైన్‌తో చేసే యాక్షన్ సీన్ అభిమానులను ఆకర్షించింది. నాగార్జున సైమన్ అనే డాన్ పాత్రలో నటిస్తున్నాడు, ఈ రోల్ కోసం ఆయన రూ. 24 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఇక ఈ సినిమా ఓవర్సీస్ మార్కెట్‌లోనూ భారీ డిమాండ్‌ను సృష్టిస్తోంది, డిజిటల్, సాటిలైట్ రైట్స్ రూ. 240 కోట్లకు అమ్ముడయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా రైట్స్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇక తాజా సమాచారం ప్రకారం, 'కూలీ' సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ను అన్నపూర్ణ స్టూడియోస్, నాగార్జున రూ. 60 కోట్లకు సొంతం చేసుకున్నారని తెలుస్తోంది. ఇది నిజమైతే తమిళ డబ్బింగ్ సినిమాల్లో రికార్డ్ ధరగా నిలిచింది. గతంలో సూర్య 'కంగువ' రూ. 25 కోట్లకు, విజయ్ 'లియో' రూ. 20 కోట్లకు, రజనీకాంత్ 'జైలర్' రూ. 17 కోట్లకు అమ్ముడుపోయాయి. ఈ డీల్‌తో నాగార్జున డిస్ట్రిబ్యూటర్‌గా ఇంత భారీ రిస్క్ ఇంతవరకు తీసుకోలేదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఇప్పటివరకు పెద్ద సినిమాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ లో పెద్దగా ఇన్వాల్వ్ కాలేదు. కానీ ఈ సారి నాగ్ నమ్మకంతో రిస్క్ తీసుకోవడానికి డిసైడ్ అయ్యారు. ఈ రైట్స్ డీల్‌తో 'కూలీ' తెలుగు రాష్ట్రాల్లో బ్రేక్ ఈవెన్ కోసం రూ. 110 కోట్ల గ్రాస్ సాధించాల్సి ఉంటుందని అంచనా. రజనీకాంత్, నాగార్జున కాంబో, లోకేష్ బ్రాండ్ వాల్యూ, స్టార్ కాస్ట్‌తో ఈ టార్గెట్ సాధ్యమేనని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఈ సినిమా ఆగస్టు 14న హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2'తో బాక్సాఫీస్ వద్ద ఢీకొట్టనుంది. ఈ భారీ క్లాష్ సినిమా వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. మొత్తంగా, 'కూలీ' సినిమా తెలుగు రైట్స్ డీల్‌తో నాగార్జున భారీ రిస్క్ తీసుకున్నాడు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.




## రొమాంటిక్ మూడ్‌లో స్టార్ హీరోయిన్



బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వెళ్లి గ్లోబల్ బ్యూటీగా పేరు దక్కించుకున్న ప్రియాంక చోప్రా ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న విషయం తెల్సిందే. 92.3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో కలిగి ఉన్న ఈ అమ్మడు ప్రస్తుతం సోషల్ మీడియాలో తన రొమాంటిక్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. గత నెలలో జరిగిన మెట్ గాలా కార్యక్రమంలో ప్రియాంక చోప్రా పాల్గొన్న విషయం తెల్సిందే. ఆ సమయంలో ప్రియాంక చోప్రాతో పాటు ఆమె భర్త నిక్ ఇంకా కూతురు కూడా ఉన్నారు. ఇంతకు ముందే మెట్ 2025 కి సంబంధించిన ఫోటోలను ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో అభిమానులతో పాటు, ఫాలోవర్స్ తో షేర్ చేసుకుంది. మెట్ 25 అంటూ మరోసారి ప్రియాంక చోప్రా ఫోటోలను షేర్ చేసింది. సిల్వర్ కలర్ ఔట్ ఫిట్‌తో ప్రియాంక చోప్రా మెరిసి పోతుంది. ఈ స్థాయి అందం కేవలం ప్రియాంక చోప్రాకే సాధ్యం అంటూ అభిమానులు సైతం కామెంట్ చేస్తున్నారు. ఇవే ఫోటోల్లో ప్రియాంక చోప్రాతో పాటు నిక్ సైతం ఉండటంతో మరింత నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. సోషల్ మీడియాలో పీసీ, నిక్‌ల ఫోటోలు ఎప్పుడు షేర్ చేసినా అభిమానులు, ఫాలోవర్స్ తెగ ఎంజాయ్ చేస్తారు. ఈసారి కూడా వీరి ఫోటోలకు అభిమానులు ఫిదా అవుతూ కామెంట్ చేస్తున్నారు. వంద మిలియన్‌ల ఫాలోవర్స్‌కి చేరువ అయిన ప్రియాంక చోప్రా ఇలాంటి ఫోటోలను షేర్ చేయడం ద్వారా మరింత త్వరగా ఆ మ్యాజిక్ నెంబర్‌ను రీచ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రియాంక చోప్రాకి ఏమాత్రం తగ్గకుండా నిక్ సైతం స్టైలిష్ లుక్‌తో మెప్పించాడు. వీరిద్దరి జోడీ ఎప్పుడూ కన్నుల విందు అన్నట్టుగా ఉంటారు అనడంలో సందేహం లేదు. ఈ అంతర్జాతీయ వేడుకలో తీసుకున్న ఈ ఫోటోలను మరోసారి షేర్ చేయడం ద్వారా ప్రియాంక చోప్రా ఆ కార్యక్రమాన్ని ఏ స్థాయిలో ఆస్వాదించిందో అర్థం చేసుకోవచ్చు. ఆ కార్యక్రమం తన జ్ఞాపకాల నుంచి పోవడం లేదు అంటూ ప్రియాంక చోప్రా ఈ ఫోటోలను షేర్ చేసిన సమయంలో చెప్పుకొచ్చింది. రొమాంటిక్ మూడ్‌లో ఉన్న ఫోటోలకు మంచి రెస్పాన్స్ దక్కింది. అందుకే అభిమానులు ఈ ఫోటోలను ఎక్కువగా షేర్ చేస్తున్నారు. ప్రియాంక చోప్రా వయస్సు పెరిగిన కొద్దీ మరింత అందంగా తయారు అవుతుంది. ఈ బ్యూటీ సినిమాల విషయానికి వస్తే చాలా కాలం తర్వాత ఇండియన్ సినిమా చేస్తుంది. అది కూడా రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమా కావడం విశేషం. మహేష్ బాబు సినిమా తర్వాత ప్రియాంక చోప్రా ఒక బాలీవుడ్ సినిమాను చేసేందుకు సిద్ధం అయింది. ఆ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగు తున్నాయి. మహేష్ బాబు సినిమా లో ప్రియాంక చోప్రా పాత్ర ఏంటి అనేది ఆసక్తికరంగా మారింది. మహేష్ బాబుకు జోడీగా ప్రియాంక చోప్రా కనిపిం చబోతుందా లేదా మరో రకంగా ఏమైనా కనిపించబోతుందా అనే చర్చ జరుగుతోంది. రాజమౌళి మాత్రం ఇప్పటి వరకు ప్రియాంక చోప్రా పాత్ర గురించి ఎలాంటి హింట్ ఇవ్వ లేదు. ముందు ముందు పీసీ మరిన్ని ఇండి యన్ సినిమాలతో పాటు హాలీ వుడ్ సిరీస్‌లను, సిని మాలను చేయాలని అభిమానులు కోరు కుంటున్నారు.



## ఆయేషా ఖాన్.. ఒక్కసారిగా హీట్ పుట్టించేసిందిగా!



బాలీ వుడ్ బ్యూటీ ఆయేషా ఖాన్ గురించి అందరికీ తెలిసిందే. టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చి అమ్మడు. ఆ మూవీలో మోత మోగిపోద్ది అంటూ తన వేరే లెవెల్ గ్లామర్ అండ్ స్టెప్పులతో మోత మోగించేసింది. సింపుల్ గా చెప్పాలంటే ఆమె వల్ల సాంగ్ హిట్టయింది. అయితే అంతకుముందే శ్రీవిష్ణు ఓం భీమ్ బుష్ మూవీలో ఛాన్స్ దక్కించుకున్నా.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరితో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఆ సినిమాలో తన యాక్టింగ్, గ్లామర్ తో ఆకట్టుకుందనే చెప్పాలి ఆయేషా ఖాన్. అలా టాలీవుడ్ లో స్పెషల్ ఫ్యాన్ బేస్ ఆమె సొంత మైంది. కానీ అప్పటికే చాలా ఏళ్ల క్రితం ఆయేషా.. తెలుగులో ఓ మూవీ చేసింది. విశ్వక్ సేన్ గెస్ట్ రోల్ లో నటించిన ముఖచిత్రంతో ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఆ తర్వాత హిందీ సీరియల్స్ కు పరిమితమైంది. హిందీ బిగ్ బాస్ తో మళ్లీ క్రేజ్ సంపాదించుకోగా.. సినిమా ఛాన్స్ లు వచ్చాయి. ఇప్పుడు పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న బ్యూటీ.. సోషల్ మీడియాలో కూడా ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటున్న అమ్మడు.. కొత్త కొత్త పిక్స్ షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది. తరచూ ట్రెండింగ్ సాంగ్స్ కు రీల్స్ చేస్తూ తెగ ట్రెండ్ అవుతుంటుంది ఆయేషా ఖాన్. అటు ట్రెడిషనల్ గా.. ఇటు మోడ్రన్ గా అందాలు ఆరబోసి అందరినీ ఫిదా చేస్తుంటుంది అమ్మడు. రీసెంట్ గా ఒక్కసారిగా నెట్టింట హీట్ పుట్టించింది. ఫ్లోరల్ ఫ్రాక్ వేసుకున్న బ్యూటీ.. రకరకాల పోజులతో మైండ్ బ్లాక్ చేసిందని చెప్పాలి. సింపుల్ గా హెయిర్ లీవ్ చేసి కుర్రాళ్ల మనసులు దోచేసుకుంది ఆయేషా ఖాన్. బెడ్ పై ఇచ్చిన పోజులు అయితే వేరే లెవెల్. ప్రస్తుతం ఆయేషా ఖాన్ పిక్స్ నెట్టింట ఫుల్ వైరల్ మారగా, ఆమె అందానికి ఎవరైనా ఫ్లాట్ అవ్వకుండా ఉంటారా అని నెటిజన్లు అంటున్నారు. బ్యూటీ లుక్స్ కు ఫ్లాట్ అయ్యామని చెబుతున్నారు. క్యూట్ గా ఉంటూనే హీట్ పుట్టించిందని కామెంట్లు పెడుతున్నారు. అందానికి ఇమేజ్ అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు.





## మిరాయ్ తో అయినా మిరాకిల్స్ చేస్తాడా?



కెమెరామెన్స్ డైరెక్టర్స్‌గా మారి మిరాకిల్స్ చేసిన వారు కొంత మందే. ఆ జాబితాలో చేరాలని పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తున్నాడు యంగ్ సినిమాటోగ్రాఫర్, డైరెక్టర్ కార్తిక్ ఘట్టమనేని. %-%ప్రేమ ఇష్క్ కాదల్ - మూవీతో కెమెరామెన్‌గా కెరీర్ ప్రారంభించిన కార్తీక్ - కార్తికేయ - తరువాత %-%సూర్య వర్సెస్ సూర్య%-% సినిమాతో దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. డైరెక్టర్ చందూ మొండేటి డైలాగ్స్ అందించి ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించలేకపోయింది. టాప్ హిట్ సినిమాలతో బెస్ట్ సినిమాటోగ్రఫీని అందించిన కార్తీక్ దర్శకుడిగా తన సత్తా చాటాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. మాస్ మహారాజా రవితేజతో కార్తీక్ చేసిన యాక్షన్ డ్రామా - ఈగల్ -. కన్ఫ్యూజ్ స్క్రీన్‌ప్లేతో చేసిన ఈ మూవీకి కార్తీక్ డైరెక్టర్, కెమెరామెన్, ఎడిటర్ కూడా. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. అయినా సరే డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని టాలెంట్‌పై ఉన్న నమ్మకంతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తనతో మరో భారీ మూవీకి శ్రీకారం చుట్టింది. అదే %-%మిరాయ్ -. ఓ ఫాంటసీ స్టోరీతో భారీ హంగులతో ఈ మూవీని రూపొందిస్తున్నారు. మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాపై కార్తీక్ ఘట్టమనేని భారీ అంచనాలు పెట్టుకున్నాడు. ఆగస్టు 1న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కాబోతోంది. రితిక నాయక్, శ్రియా శరన్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.- ఈగల్ - మూవీతో భారీ డిజాస్టర్‌ని ఎదుర్కొన్న కార్తీక్ ఘట్టమనేని -మిరాయ్ - తో మళ్లీ ట్రాక్‌లోకి రావాలని భావిస్తున్నాడు. టీజర్‌లో రివీల్ చేసిన అంశాలు సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఓ సూపర్ హీరో కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా కార్తీక్ ఘట్టమనేనికి బిగ్ కంబ్యాక్ గా నిలవడం ఖాయమనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. అంతా భావిస్తున్నట్టే కార్తీక్ ఘట్టమనేని - మిరాయ్ - తో మిరాకిల్స్ చేస్తాడా? అన్నది తెలియాలంటే ఆగస్టు 1 వరకు వేచి చూడాల్సిందే.

## 'థగ్ లైఫ్' అంచనాలు పెంచే మరో ఎలిమెంట్ ఇది..!

యూనివర్శల్ స్టార్ కమల్ హాసన్, లెజెండ్రీ డైరెక్టర్ మణిరత్నం కాంబోలో రూపొందిన థగ్ లైఫ్ సినిమా ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమాకు ఇప్పటికే ప్రమోషన్ కార్యక్రమాలతో బజ్ క్రియేట్ చేశారు. జూన్ 5న భారీ ఎత్తున విడుదల కాబోతున్న ఈ సినిమా నుంచి మరో పాటను తాజాగా విడుదల చేశారు. విశ్వద నాయకా అంటూ సాగే ఈ పాట మరోసారి థగ్ లైఫ్‌ను వార్తల్లో నిలిపింది. సినిమా కథ, నేపథ్యం గురించి ఈ పాటలో క్లీయర్‌గా, అర్థం అయ్యే విధంగా చెప్పే ప్రయత్నం చేశారు. అంతే కాకుండా కమల్ పాత్ర విషయంలోనూ ఈ పాటలో లీడ్ ఇచ్చినట్లుగా ఉంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన మూడు పాటలకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. మూడు పాటలకు మూడు పాటలు విభిన్నంగా నిలిచాయి. తాజాగా వచ్చిన విశ్వద నాయక పాట కూడా లిరిక్స్ పరంగానే కాకుండా, మ్యూజిక్ పరంగా కూడా మెప్పించింది. కమల్ హాసన్ పాత్రకు సంబంధించిన వేరియేషన్స్‌ను ఈ పాటలో చూపించే ప్రయత్నం చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యాన్ని అందించగా, ఎఆర్ అమీన్ విభిన్నమైన ర్యాప్ మ్యూజిక్‌ను అందించారు. అలెగ్జాండ్రా జాయ్ తన గాత్రంతో పాటకు మరింత హైప్ తీసుకు వచ్చారు. మొత్తానికి సినిమాకు సంబంధించిన హడావుడి ఓ రేంజ్‌లో కొనసాగుతోంది. ఈ సమయంలో వచ్చిన పాట సినిమాపై మరింత అంచనాలు పెంచాయి. అయితే కొందరు మాత్రం ఈ పాట విషయమై పెదవి విరుస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో చాలా ఏళ్ల తర్వాత కమల్ హాసన్ నటించిన సినిమా కావడంతో అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా గతంలో వీరి కాంబోలో వచ్చిన నాయగన్ సినిమా రేంజ్‌లో మణిరత్నం థగ్ లైఫ్‌ను రూపొందించారని ప్రచారం చేస్తున్నారు. ఈ సినిమాలో కమల్ హాసన్‌కు జోడీగా త్రిష నటించగా ముఖ్య పాత్రలో అభిరామి నటించింది. ఈ సినిమాలో ఉన్న లిప్ లాక్ సీన్స్‌తో ట్రైలర్ మెప్పించింది. అదే సమయంలో కొన్ని వివాదాలు సైతం ఈ సినిమా చుట్టూ ఉన్నాయి. థగ్ లైఫ్ సినిమాలో మరో తమిళ హీరో శింబు సైతం నటించడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల కాబోతున్న ఈ సినిమాను కన్నడ ప్రేక్షకులు బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల కమల్ హాసన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మాట్లాడుతూ కన్నడ భాషను చిన్నతనం చేసే విధంగా మాట్లాడారు అంటూ విమర్శలు వస్తున్నాయి. పలువురు కన్నడ భాష అంటే గౌరవం లేని కమల్ హాసన్ సినిమాను కర్ణాటకలో ఆడనిచ్చేది లేదు అంటూ ఆందోళన చేస్తున్నారు. బెంగళూరులో ఈ సినిమా షోలో పడటం అనుమానంగానే ఉంది. అందుకే థగ్ లైఫ్ తమిళ్‌తో పాటు తెలుగు, హిందీలో మాత్రమే విడుదల అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. ప్రమోషన్ మాత్రం అన్ని భాషల్లో చేస్తున్నారు. విడుదల సమయం వరకు పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి.




Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.